ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
ఆదివారం 13 జూలై 2025 | 5



వరద గోదారి

సముద్రంలోకి 5.29 లక్షల క్యూసెక్కులు



అందుకుంటా : రోడ్ కం రైలు బ్రిడ్జిని తాకేలా గోదావరి వరద

పరుగో..పరుగు : బొబ్బర్లంక వద్ద వరద ఉధృతి

గోదావరికి వరద పోటెత్తింది.. నిండు కుండలా మారింది.. లంకలను ముంచుతూ దిగువకు దూసుకొస్తోంది.. ఎగువ నుంచి వస్తున్న వరద నీటితో అఖండ గోదావరి ఉరుకులు.. పరుగులు పెడుతోంది.. ఈ ఏడాది తొలిసారి వరద ఉధృతంగా మారింది.. సముద్రంలోకి సుమారు 5.29 లక్షల క్యూసెక్కుల నీరు విడుదల చేశారు.. ఇంత ఎక్కువ నీరు విడుదల చేయడం ఈ ఏడాది ఇదే. ఇది ఏడు లక్షల వరకూ పెరగవచ్చని అంచనా.. నిన్నటి వరకూ ఎంతో ప్రశాంతంగా ఉన్న గోదావరి శనివారం ఒక్కసారిగా ఉధృతంగా మారడంతో జనం చూసేందుకు ఎగబడుతున్నారు.. ఎగువన తగ్గుముఖం పట్టడంతో దిగువన వరద ఉధృతి పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.

6

ఆదివారం ప్రత్యేకం



అదిగో పులి!

అచ్చంగా 'పులి' లెక్క.. కానీ ఇది ఫిషింగ్ క్యాట్

కేరాఫ్ కోరంగి..

చూడ్డానికి అందంగా, గుబురుగా.. దట్టంగా కనిపించే మడ అడవులు దేశంలో కాకినాడకే ప్రత్యేకం. రాష్ట్రంలో గోదావరి పరీవాహక ప్రాంతంలో 331.5 చదరపు కిలోమీటర్లలో ఇవి విస్తరించగా కృష్ణా పరీవాహక ప్రాంతంలో 250 చదరపు కిలోమీటర్లు ఉన్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో తాళ్లరేవు మండలం కోరంగి నుంచి ఐ.పోలవరం, కాట్రేనికోన, ఉప్పలగుప్తం, అల్లవరం, సఖినేటిపల్లి మండలాల్లో 58 వేల ఎకరాల్లో ఉన్నాయి. మడ అడవుల్లో 80 రకాల వృక్షజాతులున్నాయి. ఏటా ఎనిమిది దేశాల నుంచి 120 జాతుల వలస పక్షులు వస్తాయి. వందల రకాల చేప జాతులు ఇక్కడకు వచ్చి గుడ్లు పొదుగుతాయి. ఎన్నో రకాల పక్షి, జంతుజాతులు ఉండగా వాటిలో ప్రత్యేకత సంతరించుకున్నవే ఫిషింగ్ క్యాట్‌లు. ప్రపంచంలో ఇవి పది వేల వరకు ఉండగా దేశంలో రెండు వేలలోపే ఉన్నాయి. ఇందులో 155 కోరంగిలోనే ఉన్నాయి. ఇప్పుడు నాలుగేళ్ల తర్వాత వీటి సంఖ్య లెక్కించడానికి అటవీ శాఖ రంగంలోకి దిగింది. దేశంలోనే తొలిసారిగా వీటి సంఖ్యను లెక్కించడానికి రేడియో కాలర్ రింగ్ విధానం అమలు చేస్తున్నారు. ఈ ఫిషింగ్ క్యాట్‌ల మెడకు వీటిని బిగించి కొన్ని రోజుల పాటు అధ్యయనం చేయడానికి డెహ్రాడూన్ నుంచి నిపుణులు వచ్చి కోరంగిలో మకాం వేశారు. మూడింటికి వీటిని బిగించారు. త్వరలో మరో ఏడింటికి బిగించబోతున్నారు.

- కోరంగి అభయారణ్యం ఆవాసం
- సరికొత్తగా ఫిషింగ్ క్యాట్‌ల లెక్క
- మత్స్య సంపద వృద్ధిలో కీలకం
- వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ప్రాజెక్టు
- వీటి మెడకు రేడియో కాలర్ రింగ్
- దేశంలోనే తొలిసారిగా కౌంటింగ్
- అంతరించే జాతిలో ఈ క్యాట్‌లు
- జియో ట్యాగింగ్‌తో పరిశీలన

వాటిని చూస్తేనే ఒళ్లు జలదరిస్తుంది.. రాత్రి వేళలో కనిపిస్తే గుండె జల్లుమంటుంది.. చిరుత పులిలా ఒంటి నిండా చారలు.. కోర మీసాలు.. పులి తరహాలో కళ్లు.. అమ్మో మీదకు వచ్చేస్తుందేమోనని భయపెడుతుంది.. కానీ పులికాదు.. అచ్చం పులినే తలపించే ఫిషింగ్ క్యాట్ ఇది.. ఎత్తు తక్కువే కాని పులినే పోలి ఉంటుంది.. నోరు తెరిస్తే భయంకరమైన పళ్లు... పొడవాటి నాలుక.. నిజంగా పులే అని భయపడేలా చేస్తుంది.. ఇంతకీ దీని పేరేమిటో తెలుసా.. ఫిషింగ్ క్యాట్..

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

నిజమైన పులి జంతువులను వేటాడడంలో ఎంత నేర్పరో.. ఈ ఫిషింగ్ క్యాట్ (బావురుపిల్లి, నీటిపిల్లి) నీటిలో చేపలను వేటాడి తినడంలో ఎంతో నేర్పరి.. ఇది తినే చేపలతో సముద్రంలో మత్స్య సంపద పెరగడానికి దోహదపడుతుంది.. ఇదేంటి చేపలను తినే పిల్లి వల్ల చేప సంపద ఎలా పెరుగుతుంది అంటారా.. నిజమే.. చేపలు పెట్టే గుడ్లను తినే చేప జాతులెన్నో మడ అడవుల్లో ఉన్నాయి.. అలా గుడ్లను తింటూ మత్స్య సంపద పెరగకుండా చేసే చేపలనే ఈ ఫిషింగ్ క్యాట్‌లు తింటాయి.. అయితే ఫిషింగ్ క్యాట్‌లు ఐయూసీఎన్ జాబితాలో అంతరించిపోయే ప్రమాదం ఉన్న జాతిగా గుర్తించారు. ఈ ఫిషింగ్ క్యాట్‌లకు ప్రధానంగా కోరంగి అభయారణ్యం పెట్టింది పేరు.

నిరంతర పర్యవేక్షణ..

దేశంలోనే కోరంగి అభయారణ్యంలో వీటిని లెక్కించడానికి వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా ప్రత్యేక ఆసక్తి కనబర్చింది. వాస్తవానికి కోల్‌కతాలోని సుందర్‌బన్ అడవుల్లో వీటి జాడ ఎక్కువ. ఈ ఫిషింగ్‌క్యాట్ పశ్చిమబెంగాల్ రాష్ట్ర అధికారిక జంతువు కూడా. అయితే కోరంగిలోనే వీటి లెక్కింపునకు అనువైన వాతావరణం ఉండడంతో దేశంలో తొలిసారి ఇక్కడే ఇటీవల ప్రారంభించారు. ఈ ప్రాజెక్టును డెహ్రాడూన్‌లోని వైల్డ్ లైఫ్ ఇన్‌స్టిట్యూట్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ బిలాల్ హబీబ్ పర్యవేక్షిస్తుండగా కోరంగికి సైంటిస్ట్ షాహిర్‌ఖాన్, వెటర్నరీ ఆఫీసర్ సనంత్ వచ్చారు. వీరిలో సనంత్ దేశంలో ఇప్పటి వరకు 100కుపైగా పులులకు నెక్ రేడియోకాలరింగ్ అమర్చడంలో పేరు పొందారు. ఈ రేడియో కాలర్ రింగ్‌కు జియో ట్యాగింగ్ చేసి నిత్యం వీటి కదలికలను పరిశీలిస్తున్నారు. అలాగే 90చోట్ల చెట్లకు ట్రాప్ కెమెరాలు అమర్చారు. తద్వారా కోరంగిలో వీటి సంఖ్యను నిర్ధారించడానికి వీలుగా ఏర్పాట్లు చేశారు.

ఈదేస్తాయి..వేటాడేస్తాయి..

అచ్చం పులిని తలపించే ఫిషింగ్ క్యాట్‌లకు ఎంతో ప్రత్యేకత ఉంది. అసలు పులులు జంతువులను వేటాడడంలో ఎంత నేర్పరో ఇవి కూడా నీటి అడుగున ఉండే చేపలను తినడంలో నేర్పరులు. వాస్తవానికి సముద్రం, గోదావరి నీరు సంగమించే ప్రాంతంలో ఉప్పు, చప్పటి నీరు ఉంటుంది. ఇది చేప సంతతి వృద్ధికి అనుకూలం. దీంతో ఎన్నో రకాల మత్స్య జాతులు మడ అడవుల్లోకి వచ్చి గుడ్లు పొదుగుతాయి. ఇవి పిల్లలుగా మారడానికి మడ అడవుల్లోని చిత్తడి నేలలు అనుకూలం. ఈ గుడ్లను కొన్ని రకాల చేపలు తినేస్తాయి. తద్వారా మత్స్య సంపద వృద్ధికి ఇవి హాని చేస్తాయి. ఇలా గుడ్లు తినేసే కొన్ని రకాల జాతి చేపలను ఈ ఫిషింగ్ క్యాట్‌లు తింటాయి. తద్వారా మత్స్య సంపద పెరగడానికి దోహదపడతాయి. పులి తరహా దూకుడు స్వభావం ఉంటుంది. మనుషులకు హాని చేయవు. వీటి సంఖ్య లెక్కిస్తున్నామని కోరంగి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఎస్ఎస్ఆర్ వరప్రసాద్, డీఎఫ్‌వో రవీంద్రనాథ్‌రెడ్డి వివరించారు.



ఫిషింగ్ క్యాట్‌లకు నెక్ రేడియోకాలర్ రింగ్ చేస్తున్న నిపుణులు



కాకినాడ యాంకరేజ్ పోర్టులో చెక్‌పోస్టును పరిశీలిస్తున్న విశాఖపట్నం అధికారుల బృందం

కాకినాడ పోర్టులో చెక్‌పోస్టులను పరిశీలించిన విశాఖ బృందం

- ఇదే తరహాలో విశాఖ సీ పోర్టులో ఇక నుంచి చెక్‌పోస్టులు
- రేషన్ బియ్యం విదేశాలకు వెళ్లకుండా కట్టుదిట్టమైన చర్యలు

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ యాంకరేజ్ పోర్టులో ఉన్న రెండు చెక్‌పోస్టులను విశాఖపట్నం జిల్లా పౌర సరఫరాలశాఖాధికారి భాస్కర్‌రావు ఆధ్వర్యంలో బృందం శనివారం పరిశీలించింది. ఈ బృందానికి కాకినాడ జిల్లా పౌరసరఫరాల శాఖాధికారి రుద్రరాజు సత్యనారాయణరాజు స్వాగతం పలికారు. కాకినాడ యాంకరేజ్ పోర్టులో బొంబాయి కాటా వద్ద ఉన్న చెక్‌పోస్టుతోపాటు శక్తి గేట్ వద్ద ఉన్న రెండో చెక్‌పోస్టును పరిశీలించారు. 24 గంటలు సివిల్ సప్లయిస్ అధికారులు ఎలా పహారా కాస్తున్నారో అధికారులు వివరించారు. రేషన్ బియ్యం విదేశాలకు తరలిపోకుండా శాంపిల్స్ ఎలా సేకరించాలి, వాటిని ఎలా పరీక్షించి నిర్ధారించాలో ఇక్కడి అధికారులు తెలిపారు. ప్రధానంగా ఇటీవల విశాఖపట్నం పోర్టు సమీపంలో 156 మెట్రిక్ టన్నుల రేషన్ బియ్యాన్ని అధికారులు గుర్తించారు. దాడులు చేసి వాటిని సీజ్ చేశారు. ఈ నేపథ్యంలో విశాఖపట్నం సీపోర్టు నుంచి రేషన్ బియ్యం దందా జరగకూడదని మంత్రి నాదెండ్ల మనోహర్ నిర్ణయించారు. ఆయన ఆదేశాల మేరకు విశాఖపట్నం పోర్టులో కూడా త్వరలో రెండు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు అధికారులు వెల్లడించారు. దీనికోసమే కాకినాడ పోర్టులో చెక్‌పోస్టుల పనితీరు తెలుసుకోవడానికి వచ్చినట్టు అధికారులు వెల్లడించారు. గత ఏడాది జూన్‌లో మంత్రి నాదెండ్ల కాకినాడ పరిధిలో బియ్యం గోదాములపై దాడులు నిర్వహించారు. 50,647 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని సీజ్ చేశారు. దీనిలో 26,488 మెట్రిక్ టన్నుల బియ్యం కెర్నెల్స్ కల్గిన ఫోర్టిఫైడ్ పీడీఎస్ బియ్యంగా గుర్తించారు. బియ్యం కలిగి ఉన్న 13 గొడౌన్ల యజమానులపై 6(ఎ) కేసులతోపాటు క్రిమినల్ కేసులు నమోదుచేశారు. ఇది అప్పట్లో పెద్ద సంచలనమైంది. తాజాగా విశాఖపట్నం పోర్టు వద్ద 156 మెట్రిక్ టన్నులు రేషన్ బియ్యం పట్టుబడడంతో మళ్లీ రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. దీంతో విశాఖపట్నంలో కూడా చెక్‌పోస్టుల ఏర్పాటుకు సన్నాహాలు చేస్తోంది. అధికారుల బృందం ప్రత్యేకంగా స్టడీ చేస్తోంది. అధికారుల బృందంలో కాకినాడ జిల్లా ఏఎస్‌వో లక్ష్మీప్రసన్న, డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాస్ ఉన్నారు.

రాజమహేంద్రవరం కార్పొరేషన్‌కు మినిస్టీరియల్ అవార్డు

రాజమహేంద్రవరం సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ సర్వేక్షణ్‌లో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు స్టేట్ లెవెల్ మినిస్టీరియల్ అవార్డు లభించింది. గతంలో దేశంలో మంచి ర్యాంక్‌లు సాధించిన నగరాలను పరిశీలించి వాటికి జాతీయ స్థాయిలో సూపర్ లీగ్ సిటీస్‌గా, స్పెషల్ స్పెషల్ కేటగిరి, మినిస్టీరియల్ అవార్డులకు ఎంపిక చేసి కేంద్ర ప్రభుత్వం శనివారం ప్రకటించింది. నగరపాలక సంస్థకు కమిషనర్‌గా పనిచేసి ఇటీవల బదిలీ అయిన కేతన్ గార్గ్, ఎంహెచ్‌వో డాక్టర్ వినూత్న, శానిటరీ సూపర్‌వైజర్ ఇంద్రగంటి శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు, కార్మికులు నగర శుభ్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారు. పరిశుభ్రత, మెరుగైన పారిశుధ్యం, శాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని మినిస్టీరియల్ అవార్డును రాష్ట్రస్థాయిలో ఎంపిక చేశారు. ఈ మేరకు అవార్డు వరించింది. ఈ అవార్డును ఈనెల 17న దేశరాజధాని ఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో కేంద్రమంత్రి చేతుల మీదుగా ఇన్‌చార్జి కమిషనర్, కలెక్టర్ పి.ప్రశాంతి అందుకుంటారు. అవార్డుతో రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ కీర్తి ఇనుమడించబోతుంది.



అవార్డు బాధ్యత పెంచింది



రాజమహేంద్రవరం నగరపాలక సంస్థకు స్వచ్ఛసర్వేక్షణ్‌లో స్టేట్ లెవెల్ మినిస్టీరియల్ అవార్డు రావడం నగరాభివృద్ధిలో కీలక మైలురాయి. నగరపాలక సంస్థ చేపట్టిన అభివృద్ధి ప్రజాసేవా కార్యక్రమాలకు ఇది లభించిన గౌరవప్రద గుర్తింపు. ఆ గుర్తింపును నిలబెట్టుకుంటాం. పారిశుధ్యంపై మరింత దృష్టి సారిస్తాం. స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు రావడం ఆనందంగా ఉంది. **- ప్రశాంతి, కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్**



చదువుల తల్లులు.. పతకాల రాణులు!

బాక్సింగ్‌లో రాణిస్తున్న బాలికలు .. 6లో

దగా కోరులకు పాలించే హక్కు లేదు

బాబు షూరిటీ -మోసం గ్యారెంటీ వైసీపీ సభలో ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ



బాబు షూరిటీ మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రులు బొత్స సత్యనారాయణ, ముద్రగడ పద్మనాభం, తానేటి వనిత, దాడిశెట్టి రాజా, చెల్లుబోయిన వేణు, తోటనరసింహం

ప్రత్తిపాడు/కిర్లంపూడి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): దగాకోరులకు పాలించే హక్కు లేదని కూటమి నేతలను ఉద్దేశించి మాజీ మంత్రి, ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ విమర్శించారు. బాబు షూరిటీ మోసం గ్యారెంటీ పేరుతో కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గ స్థాయి వైసీపీ కార్యకర్తల విస్తృత సమావేశం శనివారం సాయంత్రం కిర్లంపూడిలోని మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం స్వగృహం వద్ద నిర్వహించారు. నియోజకవర్గ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు చేసి వాటిని అమలు పరచడంలో కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం, దగాకు గురిచేసిందన్నారు. ఎన్నికల ముందు ఏదైనా మాట్లాడవచ్చనే ధోరణితో కోకొల్లలుగా ఎన్నికల హామీలు గుప్పించి 13 నెలలు గడుస్తున్నా వాటిని అమలు చేయకపోవడం ఏంటని నిలదీశారు. మోసం, దగాలకుపాల్పడిన ఈ కూటమి ప్రభుత్వం పాలించే హక్కును కోల్పోయిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తన కేబినెట్ మంత్రుల అవినీతి, పాలన డొల్లతనాన్ని తనే బయటపెడుతున్నారని బొత్స చెప్పారు. ఇటీవల మంత్రులు, ఎమ్మెల్యేలు అక్రమాలకు పాల్పడుతున్నారంటూ ఆయన తెలపడం ఇందుకు నిదర్శనమన్నారు. ప్రజలను ఆశపెట్టి మోసగించడంలో చంద్రబాబు దిట్ట అని ఆరోపించారు. వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉచిత విద్యుత్ వంటి ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టగా, 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు అమలుచేసిన ప్రజారంజిత పథకమేదని బొత్స ప్రశ్నించారు. తమ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మిర్చి, పొగాకు, మామిడి రైతుల సమస్యలపై రైతుల వద్దకు వెళ్లి పోరాడుతుంటే చంద్రబాబు రైతులకు గిట్టుబాటు కల్పించడంలో విఫలమయ్యారన్నారు. వైఎస్ జగన్ అమ్మఒడి పథకంతో రాష్ట్రంలో ప్రతిష్టాత్మక పథకం నిర్వహించే ప్రస్తుత కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పథకంతో ఆ పథకాన్ని కొనసాగించడమే కాకుండా ఆ పథక రూపకల్పన కొడుకు లోకేశ్ చేశాడని చంద్రబాబు అనడం ఇంతకంటే మోసం, దగా ఏముంటాదని బొత్స నిలదీశారు. రాష్ట్రవ్యాప్తంగా కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను క్షేత్రస్థాయిలో ఇంటింటికీ కార్యకర్తలు తరలివెళ్లి ప్రజలకు వివరించాలని మంత్రి బొత్స పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు, మాజీ మంత్రి దాడిశెట్టి రాజా, మాజీ మంత్రులు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, తోట నరసింహం, ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్ ముద్రగడ పద్మనాభం తనయుడు గిరిబాబుతోపాటు పలువురు నాయకులు మాట్లాడారు.



అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే చినరాజప్పతో చర్చిస్తున్న రైల్వే ఉన్నతాధికారులు

మూడు రైల్వే గేట్ల స్థానంలో రెండు ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్

- రూ.300 కోట్లతో అంచనా ప్రతిపాదనలు
- పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్పతో రైల్వే ఉన్నతాధికారుల భేటీ

సామర్లకోట, జూలై12(ఆంధ్రజ్యోతి): సామర్లకోట రైల్వే ఇంజనీరింగ్ సెక్షన్ పరిధిలోని సామర్లకోట, జి.మేడపాడు రైల్వే గేట్ల స్థానంలో రెండు ఫ్లైఓవర్ బ్రిడ్జిలు, పెదబ్రహ్మదేవం వద్ద అండర్‌పాస్ నిర్మాణానికి దక్షిణ మధ్య రైల్వే ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక ఆదేశాలు జారీచేశారు. ఈ నేపథ్యంలో రైల్వే ఇంజనీరింగ్ అధికారులు సుందర్‌సేన్, షాజహాన్ శనివారం సామర్లకోటలో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పను కలిశారు. సామర్లకోట గేటు స్థానంలో ఐదు తూముల కూడలి ప్రాంతం నుంచి రైలు పట్టాలు, ఏలేరు కాలువ మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకు 900 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పున ఫ్లైఓవర్ బ్రిడ్జిని రూ.100కోట్లతో నిర్మించేందుకు ప్లాన్‌కు అనుమతులు మంజూరయ్యాయని వివరించారు. జి.మేడపాడు గేటు స్థానంలో గ్రామ శివారు శ్మశానవాటిక నుంచి రైలు పట్టాల మీదుగా గోలివారి కొత్తూరు-చినబ్రహ్మదేవం కూడలి ప్రాంతం వరకు సుమారు కిలోమీటరు పొడవు, 12 మీటర్ల వెడల్పుతో ఫ్లైఓవర్ బ్రిడ్జిని రూ.100కోట్ల వ్యయంతో నిర్మిస్తామన్నారు. పెదబ్రహ్మదేవంలో ప్రస్తుతం ఉన్న అండర్‌పాస్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదించామన్నారు. ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లకు అవసరమైన స్థల సేకరణ, బ్రిడ్జిలు, సర్వీసు రోడ్ల నిర్మాణానికి రూ.300 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు సిద్ధం చేసిన రైల్వే ఉన్నతాధికారులను ఎమ్మెల్యే చినరాజప్ప అభినందించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సామర్లకోట, జి.మేడపాడు రైల్వే గేట్ల సమస్యల పరిష్కారానికి తాను దశాబ్దకాలంగా చేసిన కృషి ఎట్టకేలకు ఫలించిందన్నారు. విజయవాడ-విశాఖ మధ్య రానున్న కాలంలో బులెట్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలకు మార్గం సుగమం అవుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నిమ్మకాయల రంగనాగ్, అడబాల కుమారస్వామి, బదుగు శ్రీకాంత్, కంటే జగదీష్ మోహన్ (బాబు), యార్లగడ్డ రవిచంద్రప్రసాద్ (చిన్ని), బలుసు శ్రీనివాసు పాల్గొన్నారు.

రిమాండ్‌కు లైంగిక వేధింపుల నిందితులు

జీజీహెచ్(కాకినాడ) జూలై 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడిన నలుగురు నిందితులను శనివారం సాయంత్రం వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం రిమాండ్ నిమిత్తం పోలీసులు కోర్టులో హాజరుపర్చారు. ల్యాబ్ టెక్నీషియన్ కోర్స్‌లో వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థినులు జీజీహెచ్‌లో శిక్షణ పొందుతున్న క్రమంలో అక్కడ పనిచేసే కళ్యాణ్ చక్రవర్తి, జిమ్మిరాజు, ప్రసాద్, గోపాలకృష్ణ కలసి విద్యార్థినుల శరీరాన్ని తాకుతూ, ఫోటోలు తీస్తూ పైశాచిక ఆనందం పొందుతూ ఆడపిల్లలని కూడా చూడకుండా తాము చెప్పింది చేయకపోతే ఫెయిల్ చేయిస్తాం అంటూ భయభ్రాంతులకు గురిచేసిన విషయం తెలిసిందే. దీంతో విద్యార్థినులకు ఏమి చేయాలో తెలియక బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతుండగా, వారి ఆగడాలు శృతి మించడంతో ధైర్యం కూడగట్టుకుని ఆర్ఎంసీ యాజమాన్యానికి మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశారు. దాంతో ఆ నలుగురు నిందితులపై అంతర్గత ఫిర్యాదుల కమిటీవిచారణ జరిపిన అనంతరం వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

మహిళా వైద్య సిబ్బంది భద్రత గాలికి.. 7

రేపు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కలెక్టరేట్(కాకినాడ), జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి ఏర్పాటుచేసిన ప్రజాఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని సోమవారం కాకినాడ కలెక్టరేట్‌లో నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పీజీఆర్ఎస్ జరుగుతుందన్నారు. అధికారులు విధిగా హాజరుకావాలని కలెక్టర్ ఓ ప్రకటనలో కోరారు.



బాక్సింగ్‌లో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు

"వారంతా చదువుకుంటున్న విద్యార్థినులే. బాక్సింగ్‌పై ఆసక్తి వారిని రింగ్‌లోకి దిగేలా చేసింది. చదువును అశ్రద్ధ చేయకుండా అందులో రాణిస్తూనే జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని పతకాల పంట పండిస్తున్నారు. జాతీయ స్థాయిలోనూ సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారు. అరకొర సౌకర్యాలతోనే వీరు చూపుతున్న ప్రతిభ క్రీడాభిమానుల ప్రశంసలు అందుకుంటోంది. తమను ప్రోత్సహిస్తే అంతర్జాతీయ స్థాయిలో భారత్‌కు పతకాలు తెచ్చిపెడతామని వారు చెప్తున్నారు."

చదువుల తల్లులు పతకాల రాణులు

- బాక్సింగ్‌లో రాణిస్తున్న బాలికలు
- జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభ
- జాతీయ స్థాయిలోనూ సత్తా చాటేందుకు ఆసక్తి
- ప్రోత్సహించి సౌకర్యాలు కల్పిస్తే అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనే అవకాశం

(పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

ప్రపంచవ్యాప్తంగా ఎందరో ఆసక్తి చూపే బాక్సింగ్‌పై ఇప్పుడు మన రాష్ట్రంలోనూ ఆసక్తి పెరుగుతోంది. ఒకప్పుడు మగవారే ఎక్కువగా పాల్గొనే ఈ క్రీడలో బాలికలు, యువతులు పాల్గొని సత్తా చాటుతున్నారు. కఠినతరమైన శిక్షణ పొందేందుకు వెనుకాడట్లేదు. చదువుకుంటూనే బాక్సింగ్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటుతున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధిస్తున్నారు. జాతీయ స్థాయిలోనూ పతకాలు కైవసం చేసుకోవడానికి వారు పడుతున్న తపన అందరినీ ఆకట్టుకుంటోంది.

కాకినాడ జిల్లా పిఠాపురం ప్రాంతానికి చెందిన పలువురు బాలికలు బాక్సింగ్‌లో శిక్షణ పొందేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. 10 నుంచి 20 సంవత్సరాల వయసు కలిగిన బాలికలు, యువతులు ఒకపక్క చదువుకుంటూ మరోపక్క బాక్సింగ్‌లో శిక్షణ పొందుతున్నారు. కనీస సౌకర్యాలు లేకున్నా పిఠాపురంలోని ఆర్ఆర్‌బీహెచ్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ఆవరణలను, అక్కడ ఉన్న స్టేజీలపై తాత్కాలికంగా బాక్సింగ్ రింగ్‌లు ఏర్పాటుచేసి బాక్సింగ్ కోచ్ లక్ష్మణరావు వీరికి శిక్షణ ఇస్తున్నారు. ఎనిమిది సంవత్సరాల నుంచి 70 మంది బాలికలు, యువతులకు బాక్సింగ్‌లో శిక్షణ ఇస్తుండగా అందులో ఫలితాలు ఇప్పుడిప్పుడే కనిపిస్తున్నాయి. గత రెండు, మూడేళ్లల్లో 40 మందికి పైగా బాక్సర్లు జిల్లాస్థాయి పోటీల్లో, 30 మంది బాక్సర్లు రాష్ట్రస్థాయి పోటీల్లో, ఒక బాక్సర్ జాతీయ స్థాయి పోటీల్లో పాలుపంచుకున్నారు. జిల్లా స్థాయిలో పదుల సంఖ్యలో బాక్సర్లు పతకాలు సాధించారు. ఐదుగురు బాలికలు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి పతకాలు గెలుచుకున్నారు. బాక్సింగ్ రింగ్ ఏర్పాటుతో పాటు శిక్షణకు అవసరమైన కనీస సదుపాయాలు కల్పిస్తే జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో పిఠాపురం బాక్సర్లు పతకాలు సాధిస్తారని కోచ్ లక్ష్మణరావుతో పాటు క్రీడాభిమానులు చెప్తున్నారు.



విశాఖపట్టణంలో జరిగిన రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో పతకాలు సాధించిన కాకినాడ జిల్లా బాక్సర్లు

ఒలింపిక్స్‌లో పతకమే లక్ష్యం

జె.ఐశ్వర్య సూర్య దీపిక



ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న జె.ఐశ్వర్య సూర్య దీపిక ఒలింపిక్స్‌లో పతకం సాధించడమే తన లక్ష్యమంటోంది. హర్యానాలోని రోహ్‌తక్‌లో జరిగిన నేషనల్ జూనియర్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో పాల్గొని ప్రతిభ చాటింది. త్రుటిలో పతకం చేజార్చుకుంది. విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ అండర్-19 బాక్సింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించింది. విశాఖలో ఈ ఏడాది ఏప్రిల్, మే నెలల్లో జరిగిన రాష్ట్ర స్థాయి యూత్, జూనియర్ బాక్సింగ్ పోటీల్లో పాల్గొని రజత పతకాలు గెల్చుకుంది. కాకినాడ, పిఠాపురం, సామర్లకోటల్లో జరిగిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా, కాకినాడ జిల్లా పోటీల్లో స్వర్ణ పతకాలు కైవసం చేసుకుంది. మెరుగైన శిక్షణ ఇస్తే జాతీయ స్థాయిలో పతకాలు సాధించడంతో పాటు అంతర్జాతీయ పోటీల్లోనూ సత్తా చూపుతానని సూర్యదీపిక ధీమాగా చెప్తోంది.

మంచి ఉద్యోగం సాధనే లక్ష్యం

కాకాడ హర్షిణి



విశాఖలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ బాక్సింగ్ పోటీల్లో కాంస్య పతకం సాధించిన పిఠాపురం పట్టణానికి చెందిన కాకాడ హర్షిణి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది. జాతీయ స్థాయిలో పతకాలు సాధించడం, మంచి ఉద్యోగం సాధించడం తన లక్ష్యమని చెప్తోంది. కాకినాడ, సామర్లకోట, పిఠాపురంల్లో జరిగిన ఉమ్మడి జిల్లా, కాకినాడ జిల్లా బాక్సింగ్ పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించింది.

రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణిస్తున్న మహాలక్ష్మి



రాష్ట్ర స్థాయి పోటీల్లో పిఠాపురం నియోజకవర్గానికి చెందిన బాక్సర్లు రాణిస్తూ పతకాలు సాధిస్తున్నారు. పిఠాపురం పట్టణానికి పి.మహాలక్ష్మి ఇంటర్మీడియట్ ఫస్టియర్ చదువుతోంది. చిన్ననాటి నుంచే క్రీడలపై ఆసక్తి ఉన్న ఈమె బాక్సింగ్‌లో శిక్షణ తీసుకుని కాకినాడ, పిఠాపురంల్లో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించింది. విశాఖలో జరిగిన రాష్ట్ర స్థాయి జూనియర్ బాక్సింగ్ పోటీల్లో రజత పతకం గెలుపొందింది. జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించి రాష్ట్రానికి తద్వారా పిఠాపురానికి పేరు తీసుకురావాలన్నదే తన లక్ష్యమని చెప్పింది.

వైద్యురాలై సేవలందిస్తా

కాకాడ హరిణి



బాక్సింగ్‌లో జాతీయ స్థాయిలో సత్తా చాటుతూ వైద్యురాలిగా స్థిరపడి పేదలకు వైద్య సేవలు అందిస్తానంటోంది పిఠాపురానికి చెందిన కాకాడ హరిణి. ఈమె ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం పూర్తి చేసింది. ఈమె సోదరి హర్షిణి కూడా బాక్సర్. ఉమ్మడి జిల్లా, కాకినాడ జిల్లా బాక్సింగ్ పోటీల్లో పాల్గొని పతకాలు సాధించింది. రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ సెలక్షన్స్ అండర్-19 బాక్సింగ్ ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికై రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంది.

భయాన్ని అధిగమించి పతకాలు సాధిస్తున్న వైష్ణవి



బాక్సింగ్ అంటే ఉన్న భయం, తల్లిదండ్రుల్లో ఉన్న సందేహాలను పటాపంచలు చేస్తూ బాక్సింగ్‌లో శిక్షణ పొందడమే కాదు పలు పతకాలు సాధించింది పిఠాపురం మండలం మల్లాం గ్రామానికి చెందిన అడబాల వైష్ణవి. ఈమె ఇంటర్మీడియట్ సెకండియర్ చదువుతోంది. ఉమ్మడి, కాకినాడ జిల్లా స్థాయిల్లో జరిగిన పోటీల్లో స్వర్ణ పతకాలు, విశాఖపట్టణంలో జరిగిన రాష్ట్ర స్థాయి యూత్ ఉమెన్ బాక్సింగ్ పోటీల్లో కాంస్య పతకం కైవసం చేసుకుంది. 'ఒకసారి నా బాక్సింగ్ ప్రయాణం చూసుకుంటే నాకే ఆశ్చర్యంగా అనిపిస్తోంది. జాతీయ స్థాయి పోటీల్లో పతకాలు సాధించడంతో పాటు ప్రభుత్వ ఉద్యోగం సాధించడమే తన లక్ష్యమ'ని వైష్ణవి చెప్తోంది.

సదుపాయాలు కల్పిస్తే జాతీయ స్థాయిలోనూ పతకాలు: లక్ష్మణరావు, బాక్సింగ్ కోచ్



బాక్సింగ్ శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన మౌలిక వసతులు లేకున్నా ఉన్న సౌకర్యాలనే వినియోగించుకుని ఎనిమిది సంవత్సరాలుగా శిక్షణ ఇస్తున్నాను. వీరు జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు ఉన్న నగరాలు నుంచి వచ్చిన వారిని దీటుగా ఎదుర్కొని పతకాలు సాధిస్తున్నారు. బాలురు కంటే అధికంగా బాలికలే బాక్సింగ్‌లో శిక్షణ పొందేందుకు ముందుకు వస్తున్నారు. బాక్సింగ్‌కు అవసరమైన అన్ని సదుపాయాలు కల్పిస్తే మన బాక్సర్లు జాతీయ స్థాయిలో సత్తా చూపి పతకాలు సాధించడం ఖాయం. ఈ దిశగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ చొరవ తీసుకోవాలని క్రీడాభిమానులు కోరుకుంటున్నారు.



ఎస్టీయూ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న సాయిశ్రీనివాస్

హామీలు అమలు చేయకపోతే ఉద్యమం

- ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్

కాకినాడ రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): గత సాధారణ ఎన్నికల సందర్భంగా కూటమి నాయకులు ఆర్థికపరమైన అంశాలపై ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను దసరాలోపు అమలు చేయకపోతే ఉద్యమం చేపడతామని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయిశ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి పేర్కొన్నారు. ఎస్టీయూ కాకినాడ జిల్లా కార్యాలయంలో శనివారం రాష్ట్ర ద్వితీయ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిశ్రీనివాస్ మాట్లాడుతూ 11వ పీఆర్సీ బకాయిలు, 2024, 2025 జూలై నాటికి నాలుగు డీఏలు పెండింగులో ఉన్నాయన్నారు. గతంలో ప్రకటించిన మూడు డీఏల ఎరియర్స్ 2021లో ఓపీఎస్ వారికి పీఎఫ్ బకాయిలు చెల్లించారు కానీ సీపీఎస్ వారికి చెల్లించలేదన్నారు.

రఘునాథ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులకు బోధనేతర పనులు ఎక్కువయ్యాయన్నారు. తిరోగమన విధానాలతో విద్యా ప్రమాణాలు మెరుగుపడవన్నారు. సమావేశంలో ఎస్టీయూ నాయకులు కోటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, రాజు, శివప్రసాద్, రామచంద్రయ్య, శ్రీనివాస్, కాశీవిశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

చేనేత రంగ అభివృద్ధిలో ముందడుగు

కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 12 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే ప్రసిద్ధిగాంచిన ఉప్పాడ చేనేత రంగ అభివృద్ధికి, చేనేత కార్మికుల జీవనోపాధి మరింత మెరుగుపర్చేందుకు తాము చేస్తున్న ప్రయత్నాలు ఫలించాయని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ తెలిపారు. కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం ఉప్పాడతో పాటు అనేక గ్రామాల్లో చేనేత రంగంపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులను ఆదుకునేందుకు నేషనల్ హ్యాండ్లూమ్ డవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా నిధులు మంజూరు చేయాలని గత కొన్ని నెలలుగా కేంద్ర ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నామన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం కూడా గతంలో కేంద్రానికి లేఖ రాసిందని గుర్తు చేశారు. ఈ పథకం అమలైతే రూ.15 కోట్లు మంజూరవుతాయన్నారు.

ఈ నిధులతో ఉప్పాడలో చేనేత రంగాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా అభివృద్ధి చేయడంతో పాటు 700 మంది చేనేత కార్మికులకు ఆర్థిక భరోసా కల్పించగలమన్నారు. ఈ నేపథ్యంలో త్వరలో చెన్నై కేంద్రంగా పనిచేస్తున్న వీవర్స్ సర్వీస్ సెంటర్, జోనల్ డైరెక్టర్ నేతృత్వంలో సాంకేతిక కమిటీ ఉప్పాడలో పర్యటిస్తుందని ఎంపీ చెప్పారు.



జీవనరేఖలు కథా సంపుటిని ఆవిష్కరిస్తున్న సాహితీవేత్తలు

24 కథల సమాహారమే 'జీవనరేఖలు'

- గ్రంథావిష్కరణ సభలో వక్తలు

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ గాంధీభవన్‌లో సాహితీ స్రవంతి ఆధ్వర్యాన ఇంద్రగంటి నరసింహమూర్తి రచించిన 'జీవనరేఖలు' కథా సంపుటి పరిచయ సభ శనివారం సాయంత్రం జరిగింది. డాక్టర్ జోస్యుల కృష్ణబాబు అధ్యక్షత వహించగా గనారా గ్రంథావిష్కరణ చేశారు. సాహితీ స్రవంతి నగర అధ్యక్షుడు మార్ని జానకిరామచౌదరి అతిథులను ఆహ్వానించారు. వక్తలుగా పి.పద్మజవాణి, ఎన్‌వీఎస్ ఇందిర హాజరయ్యారు. డాక్టర్ జోస్యుల కృష్ణబాబు మాట్లాడుతూ ఇంద్రగంటి నరసింహమూర్తి సమకాలీన సామాజిక అంశాలపై కథలు రాస్తూ మానవసంబంధాలను, భావోద్వేగాలను చక్కగా పండిస్తారన్నారు. పి.పద్మజవాణి సమీక్షిస్తూ మానవతా విలువలను తట్టిలేపే సంస్కారం, ఆశావహ దృక్పథం కలిగిన 24 కథల సమాహారమే ఈ జీవనరేఖలు అని ప్రశంసించారు. ఇందిర మాట్లాడుతూ మధ్య తరగతి మధురహాసాలకు, ఆరోగ్యకరమైన హాస్యానికి నిలువెత్తు సంతకాలు ఇంద్రగంటి కథలు అన్నారు. అనంతరం జానకిరామచౌదరి అధ్యక్షతన కవి సమ్మేళనం జరిగింది. గరికపాటి మాస్టారు, డాక్టర్ శైలజ, శుభశ్రీ, అద్దేపల్లి జ్యోతి, సావిత్రీప్రసాద్, మాకినీడి సూర్యభాస్కర్, అద్దేపల్లి ప్రభు, అవధానుల మణిబాబు, సాయి సత్యనారాయణ, సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి, చింతపల్లి సుబ్బారావు, మద్దాలి సత్యనారాయణ, ప్రభాకరవర్మ, పెండ్యాల కామేశ్వరరావు, శిరీష, పి.రామస్వామి, పెద్దింశెట్టి రామకృష్ణ, మోహనరావు, రవిచంద్ర, వెంకటనారాయణ తదితర సాహితీవేత్తలు పాల్గొన్నారు.

ఉధృతంగా గోదావరి

- ఎగువున తగ్గుముఖం
- ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ నుంచి 5,29,209 క్యూసెక్కుల నీరు సముద్రంలోకి
- మరింత పెరగనున్న ఉధృతి



ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ నుంచి ప్రవహిస్తున్న వరద నీరు

ధవళేశ్వరం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి వచ్చి చేరుతున్న వరద నీటితో ధవళేశ్వరం వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తూ సముద్రంవైపు ప్రవహిస్తోంది. ఇదే సమయంలో ఎగువున ఉధృతి తగ్గుముఖం పడుతోంది. శుక్రవారం సాయంత్రానికి ధవళేశ్వరం వద్ద 3.5లక్షల క్యూసెక్కుల నీరు సముద్రంలోకి కలవగా శనివారం సాయంత్రానికి 5,29,209 క్యూసెక్కులు కాటన్ బ్యారేజ్ గేట్ల ద్వారా సముద్రంలోకి ప్రవహిస్తోంది. దీంతో బ్యారేజీ దిగువున ఉన్న లంకలో ఇసుక మైదానం పూర్తిగా వరద ప్రవాహంతో నిండిపోయింది. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 10.60 అడుగులకు చేరుకుంది. ఆదివారం నాటికి నీటిమట్టం మరింత పెరిగి సుమారు 7లక్షల క్యూసెక్కులకు పైగా ఎగువ నుంచి రావచ్చని ఫ్లడ్ సెక్షన్ అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ఆయా అధికారులకు కేటాయించిన పరిధిలో ఫ్లడ్ డ్యూటీల్లో అప్రమత్తంగా ఉన్నారు. కాగా ఎగువున భద్రాచలం వద్ద 41.40 అడుగులకు పెరిగిన నీటిమట్టం ఆపై నిలకడగా కొనసాగి తగ్గుముఖం పట్టింది. శనివారం మధ్యాహ్నం 4 గంటలకు ఒక పాయింట్ తగ్గి 41.30 అడుగులకు చేరుకుంది.

ఎగువ నీటిమట్టాలు ఇవే

ఎగువున అన్ని ప్రాంతాల్లో వరద ఉధృతి నెమ్మదించింది. దీంతో వరద నీటిమట్టం తగ్గుదల నమోదైంది. శనివారం మధ్యాహ్నం 4గంటలకు కాళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 9.27 మీటర్లుగా నమోదు కాగా, పేరూరు వద్ద 14.35 మీటర్లు, దుమ్ముగూడెం వద్ద 11.60 మీటర్లు, భద్రాచలం వద్ద 41.30 అడుగులు, కూనవరం వద్ద 16.02 మీటర్లు, కుంట వద్ద 7.05 మీటర్లు, పోలవరం వద్ద 10.68 మీటర్లు, రాజమహేంద్రవరం రైల్వే బ్రిడ్జి వద్ద 14.68 మీటర్లుగా నీటిమట్టం నమోదైంది.

ప్రమాద హెచ్చరికలు..

కాటన్ బ్యారేజ్ 175గేట్లు పూర్తిగా ఎత్తివేసిన స్థితిలో 10లక్షల క్యూసెక్కులకు పైగా వరద నీరు దిగువకు ప్రవహించడంతో పాటు గోదావరి నీటిమట్టం 11.75 అడుగులకు చేరుకుంటే మొదటి ప్రమాదహెచ్చరిక జారీ చేస్తారు. ఆపై 13లక్షల క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తున్న సమయంలో నీటిమట్టం 13.75 అడుగులకు చేరుకుంటే రెండో ప్రమాద హెచ్చరిక జారీ అవుతుంది. 18 నుంచి 19లక్షల క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తున్న సమయంలో నీటిమట్టం 17.50 అడుగులకు చేరుకుంటే చివరి ప్రమాద హెచ్చరిక జారీ అవుతుంది.

వరద తీవ్రత తగ్గుముఖం!

చింతూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వరద తీవ్రత తగ్గనున్నట్టు చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వభరత్ పేర్కొన్నారు. శనివారం పీవో కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేశారు. సీడబ్ల్యుసీ సమాచారం మేరకు శనివారం రాత్రి 7 గంటలకు భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 41అడుగులకు చేరుకుందన్నారు.అర్ధరాత్రి నుంచి క్రమంగా తగ్గనున్నట్టు సీడబ్ల్యుసీ అంచనా వేసిందన్నారు. దీంతో ఈ వారంలో వరద ముప్పు లేనట్లేనన్నారు. కాగా గోదావరి ఎగపోటుతో శబరి నది క్రమంగా పెరిగి తదుపరి వరద తీవ్రత తగ్గనుందన్నారు. అయినప్పటికీ లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

రోడ్డుపైకి వరద.. నిలిచిన రాకపోకలు

వీఆర్ పురం, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతరేవుపల్లి, కన్నాయిగూడెం ప్రధాన రహదారిపైకి వరదనీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఐటీడీఏ పీవో అపూర్వభరత్ వరద నీరు చేరిన ప్రాంతాన్ని పరిశీలించారు. అక్కడ పోలీసులను కాపలా ఉంచారు. అన్నవరం చప్టాకు ఇరువైపులా రెయిలింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. పెద్దమట్టపల్లిలోని ఆరోగ్య ఉపకేంద్రంలో తగినన్ని మందులు అందుబాటులో ఉంచాలని, డాక్టర్‌ను ఉంచాలని డీఎంఅండ్‌హెచ్‌వో పల్లయ్యకు ఆదేశాలిచ్చారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ బాలకృష్ణారెడ్డి, మండల అధికారులు పాల్గొన్నారు.

గండిపోశమ్మ గోపురానికి వరద నీరు

దేవీపట్నం, జూలై 12(ఆంధ్రజ్యోతి): గత మూడు రోజులుగా గోదావరి ఉధృతంగా పెరగడంతో మాతృశ్రీ గండిపోశమ్మ ఆలయం చుట్టూ వరదనీరు చేరి శనివారం నాటికి గోపురాన్ని తాకింది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలకు శబరి, కిన్నెరసాని తదితర నదులు పొంగి ప్రవహించడంతో గోదావరి పరీవాహక ప్రాంతాలకు వరదనీరు చేరింది. అమ్మవారి ఆలయం వద్ద దేవస్థాన అధికారుల కార్యాలయం, నిర్మాణాలు, భక్తుల కోసం నిర్మించిన షెడ్లు మునిగిపోయాయి. గోదావరిలోకి ఎవరినీ వెళ్లనీయకుండా శనివారం ఎస్ఐ షరీఫ్ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.

ఏపీ ట్రాన్స్‌కో క్రికెట్ జట్టు కెప్టెన్‌గా శ్రీరామకృష్ణ



కడియం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ట్రాన్స్‌కో, జెన్‌కో డిస్కం క్రికెట్ జట్టు కెప్టెన్‌గా తూర్పు గోదావరి జిల్లా కడియం మండలం దుళ్ల లైన్‌మెన్ అడబాల శ్రీరామకృష్ణ ఎంపికయ్యారు. ఈ మేరకు ఏపీ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ స్పోర్ట్స్ కౌన్సిల్ ఉత్తర్వులు ఇచ్చింది. 20 మందిని జట్టుకు ఎంపిక చేయగా కెప్టెన్‌గా అడబాల శ్రీరామకృష్ణ, వైస్ కెప్టెన్‌గా విశాఖపట్నానికి చెందిన టి.అభిషేక్‌లను నియమించారు. కాగా శ్రీరామకృష్ణ స్వస్థలం చెముడులంక-గాంధీనగరం. చిన్నతనం నుంచే క్రికెట్‌లో రాణించేవాడు. లైన్‌మెన్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూ మరోపక్క క్రికెట్ ప్రాక్టీస్ చేస్తున్నాడు. బౌలింగ్, బ్యాటింగ్‌ల్లో ప్రతిభ కనబరుస్తున్నాడు.

15 నుంచి తత్కాల్‌కి ఆధార్ ఓటీపీ కచ్చితం


- అవతవకలకు చెక్ పెట్టే దిశగా రైల్వే
- ఇప్పటికే ఆన్‌లైన్ టికెట్లకు అమలు

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

తత్కాల్ టికెట్లలో జరుగుతున్న అవకతవకలను అడ్డుకట్ట వేసే దిశగా రైల్వే ఈ నెల 15 నుంచి ఆధార్‌ని కచ్చితం చేసింది. ఇప్పటికే ఈ విధానం ఆన్‌లైన్ టికెట్ల విషయంలో అమలవుతోంది. ఇప్పుడు కౌంటర్ల వద్ద తీసుకొనే టికెట్లకు కూడా అమలు చేయనున్నారు. టికెట్ తీసుకునే వారు తమ ఫోన్‌తో లింక్ అయిన ఆధార్ నెంబరును రిజర్వేషను దరఖాస్తులో రాయాల్సి ఉంటుంది. టికెట్ ఇచ్చే సమయంలో ఆ నెంబరుకు ఓటీపీ వస్తుంది. దానిని కంప్యూటర్‌లో నమోదు చేస్తేనే టికెట్ బుక్ అవుతుంది. ఇప్పటికే ఆ విధంగా రైల్వే సాఫ్ట్‌వేర్‌ని అప్‌డేట్ చేశారు. ఆధార్ నెంబరుతో లింక్ అయిన మొబైల్ నెంబరు మాత్రమే దరఖాస్తులో నింపాల్సి ఉంటుంది. టికెట్ తీసుకున్న వాళ్లు ప్రయాణం చేయకపోయినా.. సదరు టికెట్ ద్వారా ప్రయాణం చేసే వారి సమాచారం టికెట్ తీసుకున్న వారికి కచ్చితంగా తెలియాల్సి ఉంటుంది. అత్యవసర సమయంలో ఆ నెంబరుకే రైల్వే సమాచారం ఇస్తుంది. కాగా.. ప్రస్తుతం తత్కాల్ టికెట్ బుకింగ్ ఓపెన్ అయిన సెకన్లలోనే కోటా ముగిసిపోతోంది. ఒక్క నిమిషం దాటితే వెయిటింగ్ లిస్టులోకి వెళ్లిపోతోంది. గోదావరి, గౌతమి వంటి రైళ్లకు అయితే తత్కాల్ ఓపెన్ అయిన వెంటనే మొదటి టికెట్ దొరికితే అదృష్టమేనని చెప్పవచ్చు. తాత్కాల్ టికెట్లను అత్యవసర, తప్పనిసరి సమయంలో మాత్రమే అధిక శాతం జనం బుక్ చేసుకుంటారు. అందువల్ల వెయిటింగ్ లిస్టు టికెట్లు కన్‌ఫర్మ్ కావడం దాదాపుగా కష్టమనే చెప్పవచ్చు. ఇప్పుడు ఓటీపీ విధానం వల్ల కొద్ది సెకన్లు ఆలస్యం తప్పదు. ఒకవేళ ఆధార్ లింక్‌డ్ మొబైల్‌కి సాంకేతిక, నెట్‌స్లో వల్ల ఓటీపీ రాకపోతే సమయం వృథా.. టికెట్ దొరకని వ్యథ తప్పకపోవచ్చు. అయితే తత్కాల్ టికెట్లు అవసరమైన ప్రయాణికులకు దక్కడం లేదనే ఫిర్యాదులున్నాయి. ఈ టికెట్లు తీసుకోవడం కూడా ఓ అనధికారిక వ్యాపారంగా మారిపోయింది. దీనికి ఏజెంట్లు పుట్టుకొచ్చారు. టికెట్‌పై కొంత మొత్తం అదనంగా తీసుకొని తత్కాల్ లైనులో ఎవరో ఒకరు నించొని టికెట్ తీసుకుంటున్నారు. తత్కాల్ టికెట్ అప్లికేషన్లలో ఏదో ఒక పేరు నింపేసి కౌంటరు వద్ద సీరియల్ నెంబర్లు వేసి లైనులో పెడుతున్నారు. దీంతో తత్కాల్ టికెట్ అవసరమైన వాళ్లు ఆ ఏజెంట్లను ఆశ్రయించక తప్పడం లేదు. వీటన్నిటికీ చెక్ పెట్టే దిశగా ఆధార్ ఓటీపీని రైల్వే అమల్లోకి తీసుకొస్తోంది.

సమన్వయంతో సమస్యల పరిష్కారం

పీడీజే గంధం సునీత



రాజమహేంద్రవరం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సమన్వయంతో సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం అవుతుందని ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో వివిధ శాఖల అధికారులతో ఎస్పీ నరసింహ కిషోర్ అర్ధ సంవత్సర సమన్వయ సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పీడీజే విచ్చేశారు. పోలీసులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ని సందర్శించారు. పోలీసులు ఉపయోగించే డ్రోన్లు తదితర సరంజామా గురించి ఆమెకు ఎస్పీ వివరించారు. అనంతరం సమావేశంలో ఆమె మాట్లాడుతూ దర్యాప్తులు, విచారణ తదితర అంశాల్లో జరుగుతున్న పొరబాట్లు, సరిదిద్దుకునే విధానం వంటివి ప్రధాన న్యాయమూర్తి వివరించారు. పోలీసులు నిత్యం విధి నిర్వహణలో ఎదుర్కొంటున్న సమస్యలను ఎస్పీ సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం అర్ధ సంవత్సర నేర సమీక్షను ఎస్పీ నిర్వహించారు. కేసుల దర్యాప్తుల్లో ప్రతిభ కనబరిచిన అధికారులను సత్కరించారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీలక్ష్మి, పోలీసు, రెవెన్యూ, న్యాయ, వైద్య, మునిసిపల్, ఫోరెన్సిక్, ఆర్అండ్‌బీ, పీఆర్, ఆర్టీఏ, ఎన్‌హెచ్, ఎక్సైజ్, జైళ్ల, రైల్వే, విద్య, ఆర్టీసీ, విపత్తు నిర్వహణ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

పంటబోదె నుంచి ఎగజిమ్ముతున్న గ్యాస్

కాట్రేనికోన, జూలై 12(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన మండలం మొండిపొరలో పంటబోదె నుంచి గ్యాస్ ఎగజిమ్ముతోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయాన్ని సర్పంచ్ గంటి వెంకట సుధాకర్‌కు స్థానికులు తెలిపారు. వెంటనే ఆయన ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపారు. దీనివల్ల ఎటువంటి ఇబ్బందిలేదని ఓఎన్జీసీ సిబ్బంది వివరించారు. గంటవ్యవధిలో పరిస్థితిని చక్కదిద్దుతామన్నారు. ఎస్ఐ అవినాష్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. రైతులు తవ్వుకున్న బోర్ల నుంచి వాటర్ ఫ్లోటింగ్ మూలంగా శబ్దాలువస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు.

వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠా అరెస్టు

అమలాపురంటౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): అమలాపురం గొల్లగూడెంలో ఓ గృహంలో వ్యభిచారం నిర్వహిస్తున్నట్టు సమాచారంతో పట్టణ సీఐ పి.వీరబాబు ఆధ్వర్యంలో పోలీసులు దాడిచేశారు. అయినవిల్లి మండలం ముక్తేశ్వరం గ్రామానికి చెందిన జ్యోతి, అమలాపురం మండలం ఎ.వేమవరానికి చెందిన దుర్గారావు, రాజమహేంద్రవరానికి చెందిన లక్ష్మి, విజయనగరం జిల్లాకు చెందిన జయరాజులను అరెస్టు చేశారు. ఇద్దరు యువతులను, ఇద్దరు విటులను పట్టుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ వీరబాబు శనివారం తెలిపారు. రూ.వెయ్యి నగదుతోపాటు కండోమ్ ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు.





వాడపల్లిలో వెంకన్న ఆలయంలోని క్యూలైన్లలో స్వామివారి దర్శనం కోసం గంటల తరబడి భక్తుల నిరీక్షణ

గోవిందా.. హరి గోవిందా

- వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తజనం
- ఏడు గంటల పాటు క్యూలైన్లలో భక్తులు
- లొల్ల లాకుల వద్ద స్తంభించిన ట్రాఫిక్
- స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.74.02 లక్షలు

ఆత్రేయపురం, జూలై 12(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆషాడ మాసం రెండవ శనివారం సెలవురోజు కావడంతో వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తజనంతో వాడపల్లి కిక్కిరిసింది. వేకువజామునే స్వామివారికి సుప్రభాతసేవ, నీరాజన మంత్రపుష్పం, ఐశ్వర్యలక్ష్మి హోమం, బాలభోగం తదితర కార్యక్రమాలను, శాస్త్రోక్తంగా నిర్వహించి స్వామివారిని వివిధ రకాల ఫలపుష్పాలతో అలకరించారు. వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామివారి తీరువీధులలో ఏడు ప్రదక్షణలు నిర్వహించుకుని మొక్కులు తీర్చుకున్నారు. భారీ క్యూలైన్ల స్వామివారిని దర్శించుకున్న భక్తులు తులాభారాలు, కానుకలు సమర్పించుకుని అన్నప్రసాదం స్వీకరించారు. స్వామివారిని 70వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ప్రముఖులు స్వామివారిని దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా స్వామివారి ఒక్కరోజు ఆదాయం రూ.74.02 లక్షలు లభించినట్టు ఉపకమీషనర్ నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు.

ఏడుగంటల పాటు క్యూలైన్లలో భక్తుల ఇక్కట్లు

రెండో శనివారం సెలవురోజు కావడంతో వివిధ రాష్ట్రాల నుంచి అంచనాలకు మించి భక్తులు స్వామివారి క్షేత్రానికి తరలివచ్చారు. ఏడుగంటల పాటు కూలైన్లలో స్వామివారి దర్శనం కోసం వేచి ఉండి ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రూ.200 విశిష్ఠ దర్శనం సుమారు ఏడు గంటలపాటు క్యూలైన్లలో వేచియున్నారు. రూ.1116 వేదాశీర్వచనం, భక్తులు మూడు గంటల పాటు కూలైన్లలో వేచియుండి స్వామివారిని దర్శించుకున్నారు. కొంతమంది భక్తులు క్యూలైన్లలో వేచి ఉండలేక ఇబ్బందులుఎదుర్కొని నృహకోల్పోయారు. పార్కింగ్ ప్రదేశం నుంచి కనకదుర్గమ్మ ఆలయం చెక్‌పోస్టు వరకూ వాహనాలు బారులుతీరి ట్రాఫిక్ స్తంభించింది. ఎక్కడిపడితే అక్కడ వాహనాలు నిలుపుదల చేశారు. దర్శనం కోసం గంటల తరబడి ఉన్న భక్తులు మరో పక్క ట్రాఫిక్ కష్టాలు ఎదుర్కొన్నారు.

మహిళా వైద్య సిబ్బంది భద్రత గాలికి..

- రంగరాయ బోధనాసుపత్రిలో ఇంత నిర్లక్ష్యమా
- నిందితులలో ఓ వ్యక్తికి వైసీపీ నాయకుడి అండ

జీజీహెచ్(కాకినాడ) జూలై 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జీజీహెచ్‌లో ఒకేషనల్, బీఎస్సీ ఎంఎల్‌టీ విద్యార్థినులు లైంగిక వేధింపులకు గురికావడం సంచలనం రేపిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై లోతైన విచారణ జరుగుతోంది. ఈ క్రమంలో విద్యార్థినుల భద్రతలకు సంబంధించిన అంశాలపై చర్చ జరుగుతోంది. విద్యార్థినులు విధులు నిర్వర్తించే వివిధ వార్డులు, ల్యాబొరేటరీలు, ఫార్మసీల్లో ఎటువంటి సీసీ కెమేరాల పర్యవేక్షణ లేదు. దీంతో ఏళ్లకు ఏళ్లు అదే స్థానాల్లో పాతుకుపోయి రెగ్యులర్ ఉద్యోగులమంటూ చలామణి అవుతున్న వారి ఆగడాలకు అడ్డుఅదుపూ లేకుండాపోతోంది. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి ఇటువంటి ఘటనలపై ఎటువంటి చర్యలు తీసుకోలేదనే ఆరోపణలు వినవస్తోంది. బోధనాసుపత్రిలో ఇంత దారుణాలు జరుగుతున్నా జీజీహెచ్ సూపరింటెండెంట్ స్పందించకపోవడం విమర్శలకు దారితీసింది. ప్రతిపక్ష వైసీపీకి చెందిన ఒక సర్పంచ్, మాజీ ఎన్‌జీవో సంఘం అధ్యక్షుడి ఆశీర్వాదంతోనే అతని సొంత మేనల్లుడైన బి.జిమ్మిరాజు జీజీహెచ్‌లో చక్రంతిప్పేవాడని, ఇప్పుడు లైంగిక ఆరోపణల కేసులో ఇతడే ప్రధాన నిందితుడిగా ఉన్నాడని చెబుతున్నారు. తనకు రాజకీయ పలుకుబడి ఉందనే తెగింపుతో ఇష్టారాజ్యంగా జిమ్మిరాజు వ్యవహరించేవాడని పలువురు అంటున్నారు. విచారణాధికారి ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ సభ్యులకు అందుకే నిర్లక్ష్యంగా సమాధానాలు ఇచ్చాడంటున్నారు. ఇప్పుడు నిందితులను తప్పించేందుకు ఈ వైసీపీ నాయకుడు చేస్తున్న ప్రయత్నాలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం



అమలాపురంలో మాట్లాడుతున్న ఆర్యవైశ్య సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బాబి

అమలాపురంటౌన్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం, శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి వైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పచ్చిగోళ్ల జనార్ధనరావు, కొల్లూరు సత్యనారాయణమూర్తి కల్యాణ మండపాల్లో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కంచర్ల వెంకట్రావు(బాబి) తెలిపారు. ఉచిత మెగా వైద్యశిబిరాన్ని ఉదయం 9గంటలకు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రారంభిస్తారు. మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ గంటి హరీష్‌మాధుర్‌లు వివిధ విభాగాలను ప్రారంభిస్తారని తెలిపారు. మెగా వైద్య శిబిరం ఏర్పాట్లను పూర్తి చేశామన్నారు. ఈ అవకాశాన్ని పరిసర ప్రాంతాల ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని బాబి కోరారు. సమావేశంలో మెడికల్ కమిటీ చైర్మన్ పచ్చిపులుసు కృష్ణారావు, ఉపాధ్యక్షుడు వరదా సూరిబాబు, నంబూరి సత్యనారాయణమూర్తి, ఆర్గనైజింగ్ కార్యదర్శి సింగంశెట్టి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ కెమెరాలు పట్టించాయ్!

- లంకల్లో 160 లీటర్ల సారా స్వాధీనం
- ఐదుగురి అరెస్టు.. ఇద్దరు పరారీ: ఎక్సైజ్ సీఐ హనుశ్రీ



పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

రాజమహేంద్రవరం, జూలై 12(ఆంధ్రజ్యోతి): నాటుసారా, అక్రమ మద్యం తయారీపై ప్రత్యేక నిఘా పెట్టామని.. ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేదిలేదని ఎక్సైజ్ నార్త్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ పేర్కొన్నారు. గోదావరిలంకల్లో శనివారం సోదాలుచేసి నాటుసారా, బెల్లంఊటను స్వాధీనం చేసుకొని రెండు కేసుల్లో నలుగురిని అరెస్టు చేశామన్నారు. ఈ మేరకు వివరాలను వెల్లడించారు. గోంగూరలంక, షూటింగ్ లంక, బ్రిడ్జిలంకల్లో డ్రోన్‌లను ఉపయోగించి విస్తృతంగా తనిఖీలు చేశామన్నారు. సారా తయారీ స్థావరాలను గుర్తించామన్నారు. 3400లీటర్ల బెల్లపు ఊట, 160లీటర్ల సారా, ఒక పడవ, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. తాడితోటకు చెందిన బండారు దుర్గా ప్రసాద్, వనం వెంకటేశ్, వెంకటనగరానికి చెందిన గంగోతు బంగారు, ద్వారపూడికి చెందిన అయినవిల్లి స్వామిసాగర్, కోటిలింగాల పేటకు చెందిన తెలగంశెట్టి శ్రీనివాసును అరెస్టుచేసి కోర్టు ఆదేశాలతో రిమాండుకు తరలించామన్నారు. ప్రధాన నిందితులైన సంజీవ్‌నగర్‌కి చెందిన బుడ్డిగ దేవుడు, వెంటకనగరానికి చెందిన కంగ్రోతు వెంకన్నబాబు పరారీలో ఉన్నారని.. ప్రత్యేక బృందంతో గాలిస్తున్నామన్నారు. వారి సమాచారం తెలిస్తే తమకు చెప్పాలని, వివరాలను గోప్యంగా ఉంచుతామని హనుశ్రీ పేర్కొన్నారు. అలాగే నాటుసారా, అక్రమ మద్యం తయారీ, నిల్వ, విక్రయంపై ఎలాంటి సమాచారం తెలిసినా తమకు తెలియజేయడం బాధ్యతగా భావించాలని కోరారు. సోదాల్లో ఎస్ఐ ఎం.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.


పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించాడు

- చర్యలు తీసుకోవాలని యువతి, బంధువుల డిమాండ్

పిఠాపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించిన యువకుడిపై చర్యలు తీసుకోవాలని బాధిత యువతి, కుటుంబసభ్యులు, బంధువులు డిమాండ్ చేశారు. వారంతా పిఠాపురంలోని జనసేన పార్టీ కార్యాలయానికి వచ్చి నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావుని శనివారం కలిసి తమకు న్యాయంచేయాలని కోరారు. కాకినాడజిల్లా కొత్తపల్లి మండలం అమీనాబాద్ గ్రామానికి చెందిన 19 సంవత్సరాల యువతిని అదే గ్రామానికి చెందిన పోడా అంజి అనే యువకుడు పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. గర్భందాల్చడంతో గర్భనిరోధక మాత్రలు ఇచ్చి తొలగించాడని యువతి, ఆమె కుటుంబసభ్యులు తెలిపారు. గ్రామపెద్దలకు విషయం తెలపడంతో ఆ యువకుడు పెళ్లి చేసుకోవాలంటే కట్నంకావాలని డిమాండ్ చేశాడని, దానికి తాము అంగీకరించినా పెళ్లి చేసుకోవడానికి నిరాకరిస్తున్నాడని చెప్పారు. దీనిపై తాము కొత్తపల్లి పోలీసుస్టేషన్‌లో నెలరోజుల కిందట ఫిర్యాదు చేశామని తెలిపారు. పోలీసులు చుట్టూ తిరుగుతున్నా తమకు న్యాయం జరగలేదని వారు జనసేన ఇన్ చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు దృష్టికి తీసుకువచ్చారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ద్వారానే తమకు న్యా యం జరుగుతుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.

రోగికి వైద్యం చేస్తూ...

గుండెపోటుతో పీఎంపీ వైద్యుడి మృతి



కాకర శ్రీను

మండపేట, జూలై 12(ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ కోనసీమజిల్లా మండపేట మండలం అర్తమూరుకు చెందిన ఆర్ఎంపీ వైద్యుడు కాకరశ్రీను(54) శుక్రవారంరాత్రి తన క్లినిక్‌లో రోగికి వైద్యం చేస్తూ గుండెపోటుకు గురై కుప్పకూలిపోయాడు, హుటాహుటిని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించగా అప్పటికే శ్రీను మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. గ్రామంలో అందరికీ సుపరిచితుడైన శ్రీను తండ్రి నుంచి గ్రామంలో ప్రజలకు పీఎంపీగా వైద్యసేవలు చేస్తున్నాడు. ఆయన గ్రామపంచాయతీ వార్డు సభ్యుడిగా మూడు విడతల నుంచి పనిచేస్తున్నారు. ప్రస్తుతం అర్తమూరు వారు సభ్యుడుగా ఉన్నారు. మృతి చెందిన శ్రీనివాస్ కళ్లను అనపర్తికి చెందిన రాధా కృష్ణ ఐ బ్యాంక్‌కు కుటుంబసభ్యులు దానం చేశారు. ఆయనకు భార్య, ఇద్దరు కూమార్తెలు ఉన్నారు.

ట్రాక్టర్ తొట్టె తిరగబడి ముగ్గురికి గాయాలు : ఒకరి పరిస్థితి విషమం

అంబాజీపేట, జూలై 12(ఆంధ్రజ్యోతి): కర్రల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ తొట్టె తిరగబడి ముగ్గురికి గాయాలు కాగా ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. అంబాజీపేట మండలం గంగలకుర్రు గుంటమామిడి తోట మీదుగా అంబాజీపేటవైపు కర్రల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ చింతలపూడి కన్వెన్షన్ హాలువద్ద ఉన్న మలుపువద్దకు వచ్చేసరికి ట్రాక్టర్ వెనుక వైపు ఉన్న తొట్టె ఇన్‌పిన్ ఊడిపోవడంతో పక్కనే ఉన్న కొబ్బరితోటలోకి ట్రాక్టర్ బోల్తాపడింది. దీంతో కర్రల లోడుపై ఉన్నముగ్గురు కూలీలకు గాయాలు కాగా, వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. గాయపడిన వీరిని కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన ముగ్గురు రావులపాలెం మండలానికి చెందిన వారిగా తెలుస్తోంది.

అమెజాన్‌కు ప్రగతి విద్యార్థుల ఎంపిక

గండేపల్లి, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని సూరంపాలెం ప్రగతి ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థినులు గ్లోబల్ టెక్ దిగ్గజం అమెజాన్ సంస్థలో 30లక్షల వార్షిక వేతనంతో ఫుల్‌టైమ్ ఉద్యోగ అవకాశాలను సాధించారని కళాశాల చైర్మన్ డాక్టర్ పరుచూరి కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11మంది (2025లో ఉత్తీర్ణులైన) విద్యార్థులు అమెజాన్‌లో ఆరు నెలల ఇంటర్న్‌షిప్‌కు 50వేల నుంచి 70వేల మధ్య శిక్షణా వేతనంతో ఎంపికై ఆ సమయంలో వారు సీనియర్ ఇంజనీర్లతో పోటీగా పనిచేస్తూ వారి నైపుణ్యాలను ప్రదర్శిస్తూ వారిలో ఎనిమిదిమంది ఫుల్‌టైమ్ ఉద్యోగులుగా మారారని తెలిపారు. నేటి విద్యా సమాజానికి గర్వకారణంగా నిలిచే విధంగా ఉద్యోగ నియామక అవకాశాల సాధనలో తమ కళాశాల విద్యార్థులు ఎప్పుడూ ముందంజలో ఉంటారన్నారు. కళాశాల నిర్వహించే ప్రోగ్రామింగ్, సాంకేతిక నైపుణ్యాల శిక్షణ, కోడింగ్, హాకథాన్, గ్లోబల్ సర్టిఫికేషన్ కోర్సుల ద్వారా పొందిన నిర్మాణాత్మక శిక్షణా కార్యక్రమాలు దోహదపడ్డాయన్నారు. ఉభయగోదావరిజిల్లాలోని పెనుగుదురు, బొమ్మూరు, జగ్గంపేట, కరకుదురు, గొల్లలమామిడాడకు చెందిన ఆర్.శ్రీజస్వరోపా, ఇ.కోమలా, జి.మేఘనా, డి.అదితి, పి.మధు, వై.రేష్మాచౌదరి, సీహెచ్ సత్యశ్రీ ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు.

శనేశ్వరస్వామిని దర్శించుకున్న

తెలంగాణ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ పూజలు

- స్వామివారి ఆదాయం రూ.2.15లక్షలు



స్వామిని దర్శించుకున్న తెలంగాణ ఆర్టీసీ ఎండీ సజ్జనార్ దంపతులు

కొత్తపేట, జూలై 12(ఆంధ్రజ్యోతి): మందపల్లి శనేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. వేకువజాము నుంచే స్వామివారి సర్వదర్శనములకు తైలాభిషేకాలకు క్యూకట్టారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనేశ్వరస్వామి ఆలయంలో తెలంగాణ అడిషనల్ డీజీపీ, ఆర్టీసీ ఎండీ సజ్జనార్ దంపతులు శనేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయమర్యాదలతో స్వాగ తం పలికారు. వివిధసేవల ద్వారా స్వామివారికి రూ.2,15, 023 ఒక్కరోజు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమీషనర్లు, ఈవో సురేష్‌బాబు తెలిపారు.

సత్యదేవుడికి వెండి పళ్లెం బహూకరణ



వెండిపళ్లెం బహూకరిస్తున్న దాత రఘుమోహన్ గుప్తా

అన్నవరం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి నిత్య కైంకర్యాలకు వినియోగించేందుకు శనివారం ఒక భక్తుడు వెండిపళ్లెం బహూకరించారు. హైదరాబాద్‌కు చెందిన రఘుమోహన్‌గుప్తా వీటిని ఈవో వీర్ల సుబ్బారావుకు అందజేయగా దాతను ఆయన అభినందించారు. 820 గ్రాముల బరువు కలిగిన వెండి పళ్ళెం విలువ రూ.92వేలు అని దేవస్థానం అకౌంట్ విభాగ అధికారులు తెలిపారు.

సత్యదేవ నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.లక్ష విరాళం

అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి శనివారం కొంతమూరుకు చెందిన నడిమింటి నూకరాజు రూ.1,01,116లు విరాళంగా సమర్పించారు.

జీఎస్‌టీ పిన్సిపల్ చీఫ్ కమిషనర్ పూజలు

సత్యదేవుడి సన్నిదిలో శనివారం జీఎస్‌టీ ప్రిన్స్‌పల్ చీఫ్ కమిషనర్ హరేరామ్ స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందించగా ఈవో ఆయనకు స్వామివారి ప్రసాదం అందించారు.



జీఎస్టీ ప్రిన్సిపల్‌చీఫ్ కమిషనర్‌కు స్వామివారి ప్రసాదం అందజేస్తున్న ఈవో సుబ్బారావు

మద్యానికి బానిసై ...

అమ్మమ్మను చంపేశాడు

- పీక నులిమి హత్యచేసిన మనువడు
- మద్యానికి డబ్బుల కోసం వేధింపులు
- తప్పించుకున్న తల్లి, బలైన అమ్మమ్మ



వృద్ధురాలి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

తొండంగి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన మనవడు డబ్బులకోసం వేధించి అమ్మమ్మ పీక నులిమి చంపిన కిరాతక ఘటన ఆదివారం ఉదయం కాకినాడజిల్లా తొండంగి మండలం దానవాయిపేట పంచాయతీ నర్సిపేట గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఉప్పాడ కొత్తపల్లి మండలం అమీనాబాద్‌కు చెందిన బెణుగు దీనమ్మ (92) తన పెద్ద కూతురు గోసల పద్మ వద్ద నర్సిపేట గ్రామంలో ఉంటోంది. పద్మ కుమారుడు జాన్ (35) మద్యానికి బానిసై తరచూ తల్లిని, భార్యను వేధింపులకు గురి చేస్తుండడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో జాన్ తన తల్లి వద్ద ఉంటున్నాడు. పోలియో వ్యాధిగ్రస్తుడైన జాన్ మద్యానికి బానిసై డబ్బుల కోసం నిత్యం తల్లిదండ్రులను వేధింపులకు గురిచేస్తుండేవాడు. తాజాగా శనివారం తల్లి పద్మ పనిచేస్తున్న హేచరీ వద్దకు వెళ్లి డబ్బులకోసం వేధించడంతో 500 రూపాయలు ఇవ్వగా దాంతో మద్యం సేవించాడు. తిరిగి సాయంత్రం పద్మ ఇంటికి రాగా ఆమెపై దాడిచేసి ఆమెవద్ద ఉన్న కొంత మొత్తాన్ని కూడా లాక్కుని బూతులు తిడుతూ బీభత్సం సృష్టించడంతో ఆమె వేరే ఇంటికివెళ్లి తలదాచుకుంది. ఈ నేపథ్యంలో అతని దృష్టి ఇంట్లో ఉన్న వృద్ధురాలైన అమ్మమ్మ దీనమ్మపై పడింది. ఆమెకు కూడా పింఛను వస్తుండడంతో డబ్బుల కోసం ఆమెను కొట్టి వేధించడం మొదలు పెట్టాడు. దీంతోపాటు ఆమెను కొట్టి పీక నులమడంతో చనిపోయి విగతజీవిగా మారింది. ఉదయం ఆమెలో చలనం లేకపోవడంతో గమనించిన ఆమె కుమార్తె పద్మ పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి తన కుమారుడు తన తల్లిని హత్య చేసినట్లు ఫిర్యాదు చేసింది. పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు, తుని రూరల్ సీఐ చెన్న కేశవరావు, ఎస్ఐ జగన్మోహన్‌లు సంఘటనా స్థలిని పరిశీలించారు. శవాన్ని శవపంచనామా నిమిత్తం తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చోరీ కేసును ఛేదించిన పోలీసులు

- నాలుగు రోజుల్లో దొంగ అరెస్టు
- రూ.50లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం



రామచంద్రపురం చోరీ వివరాలను వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ కృష్ణారావు

అమలాపురం, జూలై 12(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరగ్గా అప్రమత్తమైన పోలీసులు నాలుగు రోజుల వ్యవధిలోనే కేసును ఛేదించారు. దొంగను అరెస్టుచేసి రూ.50లక్షల విలువైన 463 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్టు జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు తెలిపారు. శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో ఈ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. రామచంద్రపురం పట్టణంలోని రామదుర్గావీధిలో స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల స్కూలు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న దొంతంశెట్టి శ్రీనివాస్ కుటుంబం నివాసం ఉంటుంది. తన భార్యకు అనారోగ్యంగా ఉండడంతో ఈనెల 3వ తేదీన ఇంటికి తాళం వేసి శ్రీనివాస్ విశాఖపట్నం వెళ్లారు. ఈనెల 7వ తేదీన పనిమనిషి వచ్చి చూసేసరికి ఇంటి తలుపులు తీసి ఉండడాన్ని గుర్తించి యజమానికి సమాచారం అందించింది. హుటాహుటిన శ్రీనివాస్ కుటుంబం రామచంద్రపురం చేరుకున్నారు. ఇంటి మెయిన్ డోర్ తలుపు బోల్టును స్క్రూ డ్రైవర్‌తో పగులకొట్టి తలుపు గెడను తీసి ఇంట్లోకి ప్రవేశించినట్టు గుర్తించి వెంటనే రామచంద్రపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇంట్లో బంగారు ఆభరణాలు అపహరణకు గురైనట్టు శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రామచంద్రపురం సీఐ ఎం.వెంకటరమణ కేసు నమోదుచేసి ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు దర్యాప్తు చేపట్టారు. క్లూస్‌టీమ్, డాగ్‌స్క్వాడ్‌ను రప్పించడంతో పాటు క్రైమ్ పార్టీ నేరం జరిగిన స్థలాన్ని సందర్శించి సాంకేతిక ఆధారాలను సేకరించారు. సీసీ టీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితుడిని పోలీసులు గుర్తించారు. శ్రీనివాస్ ఇంట్లోనే అప్పుడప్పుడు పనిచేసే దేవగుప్త వీరబ్రహ్మం (30) ఈ చోరీకి పాల్పడినట్టు గుర్తించారు. శ్రీనివాస్ ఉంటున్న ఇంటికి సమీపంలోనే వీరబ్రహ్మం అద్దె ఇంట్లో ఉంటున్నాడు. నిందితుడిని అరెస్టుచేసి 220 గ్రాముల మూడు రాళ్ల హారాలు, 60 గ్రాముల కాసులపేరు, 46 గ్రాముల రాళ్ల గాజులు, 36 గ్రాముల గుండుగొలుసు, 35 గ్రాముల బహుబత్, 24 గ్రాముల అన్‌కట్ డైమండ్ నక్లెస్‌తోపాటు వివిధ బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నామన్నారు. రూ.50లక్షల విలువైన 463 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని వీరబ్రహ్మంను అరెస్టు చేసినట్టు ఎస్పీ తెలిపారు. ఈ కేసును ఛేదించిన రామచంద్రపురం డీఎస్పీ బి.రఘువీర్, దర్యాప్తులో పాల్గొన్న రామచంద్రపురం సీఐ ఎం.వెంకటనారాయణ, అమలాపురం టౌన్ క్రైమ్ సీఐ ఎం.గజేంద్రకుమార్, రామచంద్రపురం, ద్రాక్షారామ ఎస్ఐలు నాగేశ్వరరావు, లక్ష్మణ్, ఏఎస్ఐ అయితాబత్తుల బాలకృష్ణ, హెడ్‌కానిస్టేబుల్ వీరబాబు, పీసీలు ఏసుకుమార్, సూరిబాబు, అనిల్‌కుమార్, లోవరాజు, అర్జున్‌లకు ప్రశంసా పత్రాలు, నగదు పారితోషికాన్ని జిల్లా ఎస్పీ అందించారు. కేసును ఛేదించడంలో కీలక పాత్ర వహించిన ఐటీ కోర్ పీసీ జాఫర్, క్లూస్ టీమ్ సిబ్బందిని ఆయన అభినందించారు.

ఆగి ఉన్న లారీని ఢీకొని వ్యక్తి మృతి



లారీని ఢీకొని అక్కడికక్కడే మృతిచెందిన వ్యక్తి

తునిరూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న లారీని ఢీకొట్టి వ్యక్తి మృతి చెందిన ఘటన కాకినాడజిల్లా తుని మండలం ఎర్రకోనేరు జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఎర్రకోనేరు సమీపంలో ఒక హోటల్ ఎదురుగా ఆగిఉన్న లారీని రాజులకొత్తూరు గ్రామానికి చెందిన వేగిరాజు సూర్యనారాయణరాజు(27) ద్విచక్ర వాహనంతో వెనుక నుంచి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారంతో తుని రూరల్ పోలీసులు సంఘటన ప్రదేశానికి చేరుకుని ప్రమాదానికిగల కారణాలు సేకరించి ఎస్ఐ కృష్ణమాచార్యులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతి చెందిన సూర్యనారాయణ ఒక పెట్రోల్‌బంక్‌లో పనిచేస్తున్నాడని ఆయనకు భార్య, తల్లిదండ్రులు ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

నగదు దోపిడీకి పాల్పడిన ఇద్దరు వ్యక్తుల అరెస్టు

పిఠాపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మాయమాటలు చెప్పి వ్యక్తి నుంచి నగదు దోపిడీకి పాల్పడిన ఇద్దరు వ్యక్తులను కాకినాడజిల్లా పిఠాపురం పోలీసులు శనివారం అరెస్టు చేశారు. పట్టణ పోలీసుస్టేషన్‌లో శనివారంరాత్రి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, పట్టణ ఎస్ఐ మణికుమార్ వెల్లడించారు. శంఖవరం గ్రామానికి చెందిన వాతాడ దిలీప్ ఈనెల 5వ తేదీ రాత్రి ఇంటికి వెళ్లేందుకు పిఠాపురం ఉప్పాడ సెంటర్లో బస్సు కోసం వేచి ఉన్నాడు. ఇద్దరు వ్యక్తులు బైక్‌పై వచ్చి హైవేపైకి వెళ్తే ఏదో ఒక వాహనం దొరుకుతుందని నమ్మించి బైక్ ఎక్కించుకున్నారు. పట్టణ శివారు బైపాస్ వై.జంక్షన్ దాటిన తర్వాత తుప్పల్లోకి తీసుకువెళ్లి కత్తితో బెదిరించి అతని వద్ద ఉన్న రూ.29,400 లాక్కొని పరారయ్యారు. దీనిపై దిలీప్ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు దోపిడీకి పాల్పడిన పిఠాపురం పట్టణం కొత్తపేట, జార్జి వీధిలకు చెందిన ఆనంద భూపతి శ్రీనివాస్, బర్ల నరేష్‌లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.16వేలు నగదు, మోటార్ సైకిల్, చాకు స్వాధీనం చేసుకున్నారు. వీరిని కోర్టులో హాజరుపరుస్తామని సీఐ చెప్పారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

గొల్లప్రోలులో గోవిందనామ సంకీర్తన



గొల్లప్రోలు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం గోవిందనామ నగర సంకీర్తన నిర్వహించారు. భక్తులు గోవింద నామ స్మరణ చేసుకుంటూ మెయిన్‌రోడ్డు నుంచి రైల్వే స్టేషన్ వద్ద గల వేంకటేశ్వరస్వామి ఆలయం వద్దకు చేరుకున్నారు. స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. గోవింద నామ స్మరణ భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.



ప్రమాణస్వీకారం చేసిన లయన్స్ విజన్ క్లబ్ సభ్యులు

లయన్స్ విజన్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం

కాకినాడ సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కాకినాడ లయన్స్ విజన్ క్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారోత్సవం శనివారం చల్లా ఫంక్షన్ హాలులో జరిగింది. అధ్యక్షురాలిగా నల్లమిల్లి శ్రీదేవిరెడ్డి, కార్యదర్శిగా బులుసు శ్రీవాణి, కోశాధికారిగా డాక్టర్ విజయలక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. ప్రథమ ఉపాధ్యక్షురాలిగా అజ్జరపు రాజేశ్వరి, ద్వితీయ ఉపాధ్యక్షురాలిగా నేదినూరి దేవిహర్షిత, క్లబ్ అడ్మినిస్ట్రేటర్‌గా ముంజులూరి రామసుందరి, మెంబర్‌షిప్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా లక్ష్మీనాగిరెడ్డి, సర్వీస్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా ముత్తా రాజేశ్వరి, మార్కెటింగ్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా చల్లా విజయలక్ష్మి, డైరెక్టర్లుగా మాండలిక లక్ష్మీప్రసూన, తంగిరాల శంకరి, వక్కలంక వాణిశ్రీ, తటవర్తి రాజేశ్వరి, ఉప్పులూరి మీనాక్షి బాధ్యతలు చేపట్టారు. ఇన్‌స్టలేషన్ అధికారిగా డాక్టర్ బాదం బాలకృష్ణ వ్యవహరించారు. ముఖ్య అతిథిగా లయన్స్ ఇంటర్నేషనల్ పూర్వ జిల్లా గవర్నర్ ఈవీవీ ఈశ్వర్‌కుమార్, కీనోట్ స్పీకర్‌గా వర్శిటీ పూర్వ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ కేవీఎస్‌జీ మురళీకృష్ణ, గౌరవ అతిథులుగా ప్రథమ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ చిట్నీడి శ్రీనివాస్, ద్వితీయ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ పి.ఉమామహేశ్వరరావు, పీడీజీ వేలూరి సూర్యనారాయణ, ముంజులూరి విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికురాలికి గొడుగు అందజేస్తున్న జనసేన ఇన్‌చార్జి శ్రీనివాసరావు, సూరిబాబు

పారిశుధ్య కార్మికులకు వర్షాకాలం కిట్లు

పిఠాపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం పురపాలక సంఘ పరిధిలో పారిశుధ్య కార్మికులకు అండగా నిలిచేందుకు కొణిదల వెంకట్రావు-అంజనాదేవి జనసేవా సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కరణం సూరిబాబు కిట్లు సమకూర్చారు. వర్షాకాలంలో తడవకుండా, సీజనల్ వ్యాధుల నుంచి రక్షణకు రెయిన్‌కోట్, గొడుగులు, క్యాప్, చేతి గ్లౌజులు, వేప నూనె, మెడికేటెడ్ సబ్బులతో కూడిన కిట్లతో పాటు మహిళా కార్మికులు, కార్మిక కుటుంబాల్లో మహిళలకు చీరలను పట్టణంలోని ఆర్ఆర్ పార్కులో శనివారం జరిగిన కార్యక్రమంలో జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, జనసేవా సంఘం అధ్యక్షుడు కరణం సూరిబాబు అందజేశారు.

బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి పంతం పద్మనాభం

కాకినాడ సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి పంతం పద్మనాభం అని పలువురు నాయకులు పేర్కొన్నారు. పద్మనాభం 26వ వర్ధంతి సందర్భంగా కల్పన సెంటర్లోని ఆయన కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉమ్మడి జిల్లా పంతం పద్మనాభం నాటక పరిషత్ అధ్యక్షుడు బుర్రా పద్మనాభం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మాదేపల్లి సత్యానందరావు, నాయకులు ఆకుల వెంకటరమణ, పెద్దాడ సుబ్బారాయుడు, ఉంగరాల వెంకటేశ్వరరావు, యాళ్ల రామకృష్ణ, మార్ని జానకిరామ చౌదరి, కుక్కల పోతురాజు, తుమ్మలపల్లి వాసు తదితరులు పాల్గొన్నారు.



పద్మనాభం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

'నారుమడులకు అందని ఏలేరు నీరు'



సీపీఐ మహాసభలపై ప్రచారం చేస్తున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మధు

పిఠాపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో నారుమడులు వేసుకునేందుకు ఏలేరు నుంచి సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తాటిపాక మధు తెలిపారు. సామర్లకోటలో ఈ నెల 16, 17 తేదీల్లో జరిగే సీపీఐ జిల్లా మహాసభలపై శనివారం పిఠాపురంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాల్లో రైతులు ఇప్పటికే నారుడులు వేసుకోగా, కొన్ని ప్రాంతాల్లో నాట్లు కూడా పూర్తయ్యాయన్నారు. పిఠాపురం నియోజకవర్గంలో మాత్రం అందుకు భిన్నమైన పరిస్థితి ఉందని తెలిపారు. కాలువల ద్వారా నీరు రాక రైతులు గగ్గోలు పెడుతున్నారని చెప్పారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ తక్షణం పిఠాపురం వచ్చి కలెక్టర్, ఇరిగేషన్ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించి రైతులకు నీరందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రచారంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, నియోజకవర్గ, పట్టణ కార్యదర్శులు కేశవరపు అప్పలరాజు, సాకా రామకృష్ణ, ఎ.భవాని, మడగల రమణ, అర్జున్‌రావు, ఎస్.సూరిబాబు పాల్గొన్నారు.

శివారు ప్రాంతాలకు సాగునీరందేలా చర్యలు

పిఠాపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఏలేరు, పీబీసీ ఆయకట్టు శివారు ప్రాంతాల వరకు సాగునీరు అందేలా చర్యలు చేపట్టామని పాడా ప్రాజెక్టు డైరెక్టర్ ఎ.చైత్రవర్షిణి తెలిపారు. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణ శివారుల్లోని ఏలేరు కాలువల్లో సాగునీటి సరఫరాను శనివారం ఆమె పరిశీలించారు. ఖరీఫ్ నారుమడులు, నాట్లు వేసుకునేందుకు ఎటువంటి నీటి సమస్య ఉండదని స్పష్టం చేశారు. ఎప్పటికప్పుడు కాలువలను పరిశీలించి సాగునీటి సరఫరాను పర్యవేక్షించాలని ఆమె ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. పీడీ వెంట ఇరిగేషన్ ఏఈఈ ప్రసన్నకుమార్ వున్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దంటూ సీపీఎం ప్రచారం

కాకినాడ సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మీ ఇంటికి అదానీ ప్రీపెయిడ్ విద్యుత్ స్మార్ట్ మీటర్ బిగించడానికి ఎవరైనా వస్తే వద్దని చెప్పాలని సీపీఎం నాయకులు కోరారు. శనివారం 37వ డివిజన్ సుందరయ్య భవన్ నుంచి ఇంటింటి ప్రచారం ప్రారంభించారు. సీపీఎం జిల్లా కమిటీ సీనియర్ సభ్యుడు దువ్వా శేషుబాబ్జీ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విద్యుత్ సంస్కరణల చట్టం చేసిందని, దీని మాటున స్మార్ట్ మీటర్లు బిగించేందుకు సన్నద్ధమవుతున్నారన్నారు. ప్రచారంలో సీపీఎం నగర కమిటీ కన్వీనర్ పలివెల వీరబాబు, సభ్యులు కె.నాగజ్యోతి, మలక వెంకటరమణ, చంద్రమళ్ల పద్మ, మేడిశెట్టి వెంకటరమణ, టి.రాణి తదితరులు పాల్గొన్నారు.

రూ.36కోట్లతో ఏలేరు జలాల శుద్ధి

పెద్దాపురం, సామర్లకోట ప్రజలకు కుళాయిల ద్వారా తాగునీరు

ఎమ్మెల్యే చినరాజప్ప



సామర్లకోట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట, పెద్దాపురం పట్టణాల ప్రజలకు కలుషితం లేని ఏలేరు జలాలను మళ్లించి శుద్ధి చేసి కుళాయిల ద్వారా తాగునీరు సరఫరా చేసేందుకు రూ.36కోట్లతో పంపిన ప్రతిపాదనలకు సాంకేతికంగా అనుమతుల మంజూరు లభించిందని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప వెల్లడించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెద్దాపురం, సామర్లకోట మున్సిపాలిటీల్లో తాగునీటి పైపులైన్ల ఆధునికీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. తన నియోజకవర్గంలోని పలు పరిశ్రమల నుంచి వెలువడుతున్న వ్యర్థ కాలుష్య జలాలు సామర్లకోట శివారున ఏలేరు మురుగు కాలువలో చేరేలా ప్రత్యేక చానల్ ఏర్పాటుకు అనుమతులు లభించాయన్నారు. కాకినాడ జిల్లాలోని పలు పట్టణాలు, గ్రామాల నుంచి చెత్త, వ్యర్థ పదార్థాలను ఒకచోటికి తరలించి చెత్త నుంచి సంప్రదాయేతర ఇందన వనరులను అభివృద్ధి చేసే భారీ పరిశ్రమ త్వరలో ఏర్పాటు కానుందన్నారు.

సామర్లకోటలో రూ.4కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు ఆమోదానికి నోచుకున్నప్పటికీ వైసీపీలో ఛైర్‌పర్సన్, కౌన్సిలర్ల మధ్య వివాదంతో అడ్డు తగలడం ఎంతమాత్రం సమంజసం కాదని ఎమ్మెల్యే చినరాజప్ప అన్నారు. పట్టణంలో మూడు నెలలుగా అభివృద్ధి నిలిచిపోవడం, కౌన్సిల్ సమావేశాలు జరగకపోవడంతో నిధులు మురిగిపోయే ప్రమాదం ఉందన్నారు. ఇటీవల పిఠాపురం నియోజకవర్గ పరిధిలోని గొల్లప్రోలు నగర పంచాయతీలో జిల్లా కలెక్టర్ జోక్యంతో పనులకు అనుమతులు లభించాయన్నారు. అదేరీతిలో సామర్లకోట మున్సిపాల్టీలోనూ అభివృద్ధి పనులకు అనుమతులు లభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సామర్లకోటలో జరిగిన వైసీపీ సమావేశంలో ఆ పార్టీ ఇన్‌చార్జి అవాకులు, చవాకులతో కూడిన వ్యాఖ్యలు చేయడం ఎంతమాత్రం తగదన్నారు. నువ్వు ఐదేళ్లపాటు ఇన్‌చార్జిగా వ్యవహరించి చేసిన అభివృద్ధి ఏమిటో, ఏడాదిగా తన హయాంలో చేసిన అభివృద్ధి ఏమిటో మాట్లాడేందుకు చర్చకు సిద్ధమేనా అని చినరాజప్ప సవాల్ చేశారు.

అట్టహాసంగా నాయీబ్రాహ్మణ ఉచిత వివాహ పరిచయ వేదిక



వివాహ పరిచయ వేదికపై నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ సదాశివం, సంఘీయులు

కాకినాడ సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నాయీబ్రాహ్మణ ఉద్యోగుల వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కాకినాడ సూర్యకళా మందిరంలో తెలుగు రాష్ట్రాల నాయీబ్రాహ్మణ ఉచిత వివాహ పరిచయ వేదిక శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు అట్టహాసంగా జరిగింది. విశిష్ట అతిథులుగా విశ్వధర్మ పరిరక్షణ వేదిక, రాష్ట్రీయ పరశురామ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రముఖ జ్యోతిష్యుడు కృష్ణమాచార్య గురూజీ, రాష్ట్ర నాయీబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం, గౌరవ అతిథులుగా వ్యవసాయ శాఖ విశ్రాంత జాయింట్ డైరెక్టర్ ఇవ్వల రామకృష్ణమూర్తి, ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ రిటైర్డ్ ట్రైనింగ్ ఆఫీసర్ ఇరవాడ జగన్మోహనరావు, ఐడియల్ కళాశాల గణిత శాస్త్రం హెచ్‌వోడీ దాలిపర్తి రామకృష్ణ విచ్చేశారు. ధన్వంతరి నాయీబ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు, అసోసియేషన్ జిల్లా ఛైర్మన్ సుందరపల్లి గోపాలకృష్ణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాయీబ్రాహ్మణులు విద్య, ఉపాధి రంగాల్లో రాణించాలన్నారు. బీసీ కార్పొరేషన్ ద్వారా అందించే స్వయం ఉపాధి రుణాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలన్నారు. వివాహ పరిచయ వేదికకు వివిధ జిల్లాల నుంచి సుమారు 500 మంది యువతీ, యువకులు హాజరయ్యారు. నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్లు కోరుప్రోలు నూకరాజు, యానాపు ఏసు, లంక రత్నారావు, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దంగేటి పాపారావు, ప్రధాన కార్యదర్శి వేములూరి గణపతిరావు, కోశాధికారి పెదపూడి వీరభద్రరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ మేడపాటి మాచరగణేష్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరైనా పూడికలు తొలగించరా!

పిఠాపురం వంతులో 100 క్యూసెక్కుల నీరు కూడా రావట్లేదు: ఏలేరు ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ నానిబాబు ఆగ్రహం



ఏలేరు ప్రధాన కాలువలో పూడిక, చెత్తాచెదారాన్ని తొలగించే ప్రయత్నం చేస్తున్న నానిబాబు

పిఠాపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఏలేరు కాలువల్లో పూడికలు తొలగించేందుకు ఆపరేషన్, మెయింటెనెన్స్ కింద నిధులు మంజూరైనా ఎగువ ప్రాంతాల్లో పనులు చేపట్టకపోవడంపై ఏలేరు ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ ఊటా నానిబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కారణంగా పిఠాపురం నియోజకవర్గానికి సాగునీరు అందట్లేదన్నారు. పిఠాపురం ప్రాంతానికి సాగునీరు సరఫరా అయ్యే కిర్లంపూడి వద్ద గల ఏలేరు ప్రధాన కాలువలను ఆయన శనివారం పరిశీలించి పూడిక, చెత్తాచెదారంతో నిండిపోవడాన్ని గమనించారు. తక్షణం పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఇక్కడ కాలువలోకి దిగి చెత్తాచెదారం తొలగించే ప్రయత్నం చేశారు. ఎస్.తిమ్మాపురం రెగ్యులేటరు వద్ద పిఠాపురం వంతుకు 100 క్యూసెక్కుల నీరు కూడా రావట్లేదని గుర్తించారు. ఈ విషయాన్ని జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు ద్వారా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

జీజీహెచ్ సూపరింటెండెంట్ నియంత వైఖరిపై ఆగ్రహం

జీజీహెచ్ (కాకినాడ), జూలై 12 (ఆంధ్రజ్యోతి) కాకినాడ జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి నియంత ధోరణిపై టీడీపీ కాకినాడ 36వ డివిజన్ ఇన్‌చార్జి నల్లూరి శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇక్కడ సామాన్యులకు వైద్యం అందని ద్రాక్షగా ఉందన్నారు. రోగుల పట్ల, ప్రజాప్రతినిధుల పట్ల ఆమె ప్రవర్తన పూర్తిగా నిరంకుశంగా ఉందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ కొత్తపేట మండలం గంటికి చెందిన వై.శ్రీహరి లివర్ సమస్యతో జీజీహెచ్‌లో చేరాడన్నారు. ప్రాణాపాయంలో ఉన్న అతడిని ఏఎంసీయూలో చేర్చాలని తాను పలుమార్లు అభ్యర్థించగా అయితే సూపరింటెండెంట్ కనీసం స్పందించలేదన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఫొటోను ఆసుపత్రిలో పెట్టలేదన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్, హెల్త్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు, కలెక్టర్ షాన్‌మోహన్ తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు.



ఎక్స్‌కవేటర్‌తో ప్రధాన కాలువ పూడికతీత పనులు చేస్తున్న దృశ్యం

చీడిగలో ప్రధాన కాలువ పూడికతీత పనులు

కాకినాడ రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీడిగలోని ప్రధాన పంట కాలువ, మురుగునీటి కాలువల్లో కొన్నేళ్లుగా పూడిక తీయలేదు. దీంతో కాలువ చెత్తాచెదారం, తూటికాడ, గుర్రపుడెక్కతో మూసుకుపోయింది. వర్షాలు ఎక్కువగా కురిసినపుడు గ్రామంలోని వర్షపునీరు కాలువ ద్వారా వెళ్లకపోవడంతో గ్రామస్తులు చాలా ఇబ్బందిపడేవారు. గత వైసీపీ ప్రభుత పాలనలో పూడికతీత పనులు చేపట్టకపోవడంతో కాలువ మొత్తం తుప్పలు, పిచ్చిమొక్కలతో మూసుకుపోయింది. ఈ సమస్యను కూటమి నాయకులు కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు. ప్రధాన కాలువలో పూడికను పూర్తిగా తొలగించాలని ఆదేశించడంతో మూడు రోజులుగా ఎక్స్‌కవేటర్, మనుషులతో పనులు చేయిస్తున్నామని జనసేన చీడిగ గ్రామ కమిటీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ తెలిపారు. ఈ పనులను శనివారం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా జనసేన ప్రధాన కార్యదర్శి శిరంగు శ్రీనివాసరావు పరిశీలించారు. దుర్వాసన, పాములు, దోమలతో కొన్నేళ్లుగా ఎన్నో ఇబ్బందులుపడ్డామని, ప్రధాన మురుగునీటి కాలువ పూడికతీత పనులు చేపట్టడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.

మెరుగైన పాలనకు కూటమి ప్రభుత్వం కృషి

'సుపరిపాలనలో తొలి అడుగు' ప్రచారంలో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు

కాకినాడ సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మెరుగైన పాలన అందించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. నగరంలోని 7వ డివిజన్ రేచర్లపేటలో శనివారం సుపరిపాలనలో తొలి అడుగు నిర్వహించారు. ప్రజల వద్దకు వెళ్లి కూటమి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరిస్తూ కరపత్రాలు అందజేశారు. నాయకులు అంబటి చిన్న, బొచ్చా దాసు, కొల్లు కుమారి, కోలా ఎల్లారావు, ఎంఏ తాజుద్దీన్, బత్తిన ఉమ, సామంతుల నాగేంద్రప్రసాద్, పొట్నూరి వరప్రసాద్, లాలు, బాబులు, డోకుబుర్ర రాజు తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని నీలమ్మ చెరువు, సంగీతరావుపేటల్లో టీడీపీ నాయకులు బడుగు శ్రీకాంత్, అడబాల కుమారస్వామి ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేపట్టిన సంక్షేమ పథకాలను మహిళలకు వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. నిమ్మకాయల రంగనాగ్, కంటే జగదీష్‌మోహన్ (బాబు), యార్లగడ్డ రవిచంద్ర ప్రసాద్ (చిన్ని), టీడీపీ కౌన్సిలర్లు జయలక్ష్మి, బలుసు శ్రీనివాసు, మాజీ కౌన్సిలర్లు వేల్పుల జయలక్ష్మి, గంద్రేటి సూర్యకుమారి, జనసేన నాయకురాలు పెంకే వెంకటలక్ష్మి, అందుగుల జార్జిచక్రవర్తి, గొలితి సత్యనారాయణ, మహంకాళి వెంకట గణేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూలపేటలో టీడీపీ రాష్ట్ర అధికార ప్రతనిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ జనరంజకమైన పాలన అందిస్తున్నారని చెప్పారు. టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు అనిశెట్టి సత్యానందరెడ్డి, మాజీ జడ్పీటీసీ బత్తుల చైతన్యరాజేష్‌కుమార్, మత్స్యకార నాయకులు మేరుగు సూరిబాబు, కంబాల వెంకటరమణ, రాజారావు, నాగేశ్వరరావు, మహేశ్వరరావు, నాగు తదితరులు పాల్గొన్నారు.

పిఠాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 11వ వార్డులో తెలుగుదేశం పార్టీ నాయకులు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాదిలో సాధించిన విజయాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. పాదగయ మాజీ ఛైర్మన్ కొండేపూడి సూర్యప్రకాష్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో శృంగార వల్లభస్వామి

తొలి తిరుపతికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొలి తిరుపతికి శనివారం భక్తులు పోటెత్తారు. శృంగార వల్లభస్వామికి అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు విశేష పూజలు, అభిషేకాలు చేశారు. సుమారు 12 వేల మందికి పైగా దర్శించుకున్నారు. రూ.3,73,904 ఆదాయం లభించిందని ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.



ఏఎస్‌డీ కళాశాలకు బెంచీలు అందజేత

కలెక్టరేట్ (కాకినాడ), జూలై 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని జగన్నాథపురంలో గల అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు లెనోరా దంత వైద్య కళాశాల, కేఎల్ఆర్ విద్యా సంస్థల ఛైర్‌పర్సన్ నాగమణి పది బెంచీలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తమ విద్యా సంస్థల అధినేత లక్ష్మారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని ఈ వితరణ చేశామన్నారు. ప్రిన్సిపాల్ అనంతలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ సువర్చల, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ వసంతలక్ష్మి పాల్గొన్నారు.



చాగంటికి తిరుమల స్వామివారి ప్రసాదం అందజేస్తున్న సదాశివం

చాగంటిని మర్యాదపూర్వకంగా కలిసిన సదాశివం

కాకినాడ సిటీ, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ప్రవచనకర్త డాక్టర్ చాగంటి కోటేశ్వరరావును శనివారం అచ్చంపేట గోశాలలో రాష్ట్ర నాయీబ్రాహ్మణ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ రుద్రకోటి సదాశివం మర్యాదపూర్వకంగా కలిశారు. చాగంటిని శాలువాతో సత్కరించి తిరుమల లడ్డూ ప్రసాదం అందజేశారు. అనంతరం చాగంటి ఆశీస్సులు అందుకున్నారు. ధన్వంతరి నాయీబ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సుందరపల్లి గోపాలకృష్ణ, నడింపల్లి పాపారావు, తీపర్తి విజయ్, కొమ్మన తాతారావు, వేపాడ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'చెరువు స్థలాలు ఆక్రమిస్తే చర్యలు'

గొల్లప్రోలు రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): చెరువు స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని గొల్లప్రోలు తహసీల్దారు పీవీ గోపాలకృష్ణ హెచ్చరించారు. గొల్లప్రోలు మండలం చిన జగ్గంపేటలోని బూర వారి చెరువులో నిర్మాణాలు జరుగుతున్నట్టు అందిన ఫిర్యాదులపై శనివారం ఆయన తనిఖీలు నిర్వహించారు. అక్కడ నిర్మాణాలను గుర్తించారు. సర్వే నెం. 48లో 17.35 ఎకరాల విస్తీర్ణంలో చెరువు ఉందని, ఇది ప్రభుత్వం ఆధీనంలో ఉందని తెలిపారు. దీనిని అక్రమించి ఎటువంటి కట్టడాలు నిర్మించినా, చెట్లు కొట్టినా చట్టపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ స్థలాల పరిరక్షణకు చర్యలు చేపడతామని చెప్పారు.

వైసీపీ మునిసిపల్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా బాబీ

పిఠాపురం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పిఠాపురం మునిసిపల్ కమిటీ ప్రధాన కార్యదర్శిగా వజ్రపు బాబీ నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు జగన్ నుంచి ఆదేశాలు అందాయి. బాబీని కాకినాడ మాజీ ఎంపీ వంగా గీతావిశ్వనాథ్‌తో పాటు పలువురు అభినందించారు.

తొలి తిరుపతికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొలి తిరుపతి శృంగార వల్లభస్వామి క్షేత్రానికి శనివారం 12వేల మందికి పైగా భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామివారికి అర్చకులు పెద్దింటి పురుషోత్తమాచార్యులు, పెద్దింటి నారాయణాచార్యులు విశేష పూజలు, అభిషేకాలు చేశారు. రూ.3,73,904 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో వడ్డి శ్రీనివాసరావు తెలిపారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

రహదారి బాగు చేయించాలని సీఎంకు లేఖ

మోతుగూడెం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మోతుగూడెం కొత్తవీధి మండలం ఆర్‌వీనగర్ జంక్షన్ నుంచి వై.రామవరం మండలం పాలగెడ్డ వరకు ఉన్న ఆర్ అండ్‌బీ రహదారిని బాగు చేయించాలని సీఎంకి వై.రామవరం మండలం డొంకరాయి ఎంపీటీసీ కరకా వెంకట రమణ లేఖ రాశారు. ఈ విషయాన్ని శనివారం మీడియాకు వెల్లడించారు. ఏజెన్సీలో ఉన్న ఎస్‌హెచ్ 516, 30 రహదారులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని అందులో పేర్కొన్నారు. వీటి నిర్మాణానికి టెండర్లు పిలిచి, కాంట్రాక్టర్‌ను ఎంపిక చేసినా న్యాయపరమైన చిక్కులు ఉండడంతో పనులు జరగడం లేదని తెలిపారు. ఈ సమస్యను సత్వరమే పరిష్కరించాలని లేఖలో కోరారు. రహదారులు బాగుండకపోవడంతో వైజాగ్ నుంచి వచ్చే రాత్రిపూట బస్సును ఆర్టీసీ రద్దు చేసిందన్నారు.

మధ్యవర్తిత్వంతో సమస్యలు పరిష్కారం

దేవీపట్నం, జూలై 12(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వంతోనే సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయని మండల న్యాయ సేవాధికార సంస్థ పారా లీగల్ వలంటీర్ తెల్లం శేఖర్ పేర్కొన్నారు. శనివారం దేవీపట్నం పోలీస్‌స్టేషన్‌లో పారాలీగల్ వలంటీర్లు మధ్యవర్తిత్వం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈనెల 10వ తేదీ నుంచి 16 వరకు మధ్యవర్తిత్వం ప్రయోజనాలపై ప్రజలకు వివిధ రూపాల్లో అవగాహన కల్పిస్తామన్నారు. ప్రజలకు ఏ సమస్య ఉన్నా జాతీయ సేవాధికార సంస్థ టోల్‌ఫ్రీ నెంబరు 15100కు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వలంటీర్లు యలగాడ నాగేశ్వరరావు, కారం రామన్నదొర, మడకం వరప్రసాద్‌దొర, తదితరులు పాల్గొన్నారు.

'దుండగులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి'


చింతూరులో ర్యాలీ చేస్తున్న ఆదివాసీ జేఏసీ నేతలు

చింతూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కూనవరం మండలం టేకులబోరులో కొమరం భీం విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి, వారిపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం చింతూరులో ఆదివాసీ జేఏసీ ర్యాలీ నిర్వహించారు. అందులో భాగంగా గంటందొర, కొమరం భీం, మల్లుదొర, అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జేఏసీ డివిజన్ చైర్మన్ జల్లి నరేష్, నేతలు శీలం తమ్మయ్య, కాక సీతారామయ్య, ఆదివాసీ ఉద్యోగ సంఘ నాయకులు తిమ్మసాయి, కణితి గణేష్, సోడె నారాయణ, తోడెం చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

దేవీపట్నం: ఆదివాసీ పోరాట యోధుడు కొమరం భీం విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను వెంటనే కఠినంగా శిక్షించాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్, జిల్లా అధ్యక్షుడు రామారావు దొర డిమాండ్ చేశారు. శనివారం వారిద్దరూ మాట్లాడుతూ కూనవరం మండలం కోతులగుట్టలో సచివాలయం ఎదురుగా ఉన్న ఆదివాసీల ఆరాధ్య దైవం, ఆదివాసీ పోరాట యోధుడు కొమరం భీం విగ్రహాన్ని ఈనెల 9వ తేదీ రాత్రి గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేశారని, అదేరోజు జగ్గవరం క్రాస్‌రోడ్డు ఆదర్శస్థూపం వద్ద జెండా కర్రను పీకి పారేశారన్నారు. వెంటనే దీనిపై ప్రభుత్వం స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఏజెన్సీలో ఉద్యమం తప్పదని హెచ్చరించారు.


మాట్లాడుతున్న ఆదివాసీ జేఏసీ నేతలు తెల్లం శేఖర్, రామారావు దొర

ఆదివాసీ ఐక్యతకు ఏఐఏఈఎఫ్ వేదిక కావాలి


కార్యక్రమంలో పాల్గొన్న ఏఐఏఈఎఫ్ నాయకులు

రంపచోడవరం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా ఆదివాసీ ఎంప్లాయిస్ యూనియన్ ఫెడరేషన్ (ఏఐఏఈఎఫ్) జాతీయ స్థాయిలో ఆదివాసీ ఐక్యత, ఉద్యమాలకు గొప్ప వేదిక కావాలని సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చిట్టాపులి శ్రీనివాస్ పడాల్ అన్నారు. శనివారం స్థానిక యూటీఫ్ కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కంగల శ్రీనివాస్ అధ్యక్షతన రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఇందులో జిల్లా నూతన అధ్యక్షుడిగా జి.సోంబాబు, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా కె.మల్లేశ్వరరావు, జనరల్ సెక్రెటరీగా కంగల శ్రీను, మహిళా ప్రెసిడెంట్‌గా కనకదుర్గ, వైస్ ప్రెసిడెంట్‌గా కె.లక్ష్మీ వరప్రసాద్, ఆర్గనైజర్లుగా కుంజం బాపిరాజుదొర, చిచ్చడి శేషారావ్, సెక్రెటరీ పి.సురేష్‌కుమార్, పొండియం పండుదొర, కారం వెంకట రమణ, సీహెచ్ శివకుమార్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ టీచర్స్ యూనియన్ స్టేట్ చైర్మన్ కారం రంగారావు, ఏఐఏఈఎఫ్ నాయకులు తుష్టి జోగారావు, తెల్లం శేఖర్‌దొర, జోడి నాగేశ్వరరావు, మొట్ల కృష్ణారెడ్డి, బి.మంగాయమ్మ, సారపు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వరదల సమయంలో అప్రమత్తంగా ఉండాలి : పీవో


స్థానికులతో మాట్లాడుతున్న పీవో

కూనవరం, జూలై 12(ఆంధ్రజ్యోతి): వరదల సమయంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్ అన్నారు. శబరి గోదావరి నదులు ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో ఆయన ముంపునకు గురయ్యే గ్రామాలను శనివారం పరిశీలించారు. అనంతరం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నాటు పడవల యజమానులను పిలిపించి ప్రజలకు అందుబాటులో ఉండా లని, వారికి అవసరమయ్యే అన్ని సౌకర్యాలు కల్పిస్తామని బోట్ యజమానులకు తెలిపారు. అంతకుముందు కూటూరు ప్రైమరీ హెల్త్ సెంటర్ సందర్శించి అక్కడ ప్రస్తుతం ఉన్న మందులను స్వయంగా పరిశీలించారు. గోదావరి శబరి వరదలు సమయంలో డాక్టర్లను అందుబాటులో ఉంచాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ పుల్లయ్యను ఆదేశించారు.

డొంకరాయిని సందర్శించిన సీపీఎం రాష్ట్ర నేతలు

మోతుగూడెం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వై.రామవరం మండలం డొంకరాయిలో శనివారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసు, జిల్లా ఇన్‌చార్జి లోకనాథం పర్యటించారు. ఈ సందర్భంగా గిరిజన ప్రజలతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్థులు డేవిడ్, మగాళ్దాన్, లైకస్, ముక్తా, తదితరులు గ్రామ సమస్యలను విన్నవించారు. గ్రామంలో ఉపాధి జాబ్‌కార్డులు ఉన్నప్పటికీ పని చూపించడం లేదన్నారు. రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని చెబుతున్నప్పటికీ ... కానీ మాటల్లో శూన్యమన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి బొప్పన కిరణ్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకట్, జిల్లా నాయకులు చింత రాంబాబు, నాయకులు బీవీరమణ, అడ్వకేట్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు

ప్రజా సంక్షేమం, అభివృద్ధే మొదటి ప్రాధాన్యం




జగ్గంపేట రూరల్: కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు, ఏలేశ్వరం: కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ, ప్రత్తిపాడు: చింతలూరులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

- జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ
- పలుచోట్ల 'సుపరిపాలన' కార్యక్రమాలు

జగ్గంపేటరూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ప్రజల సంక్షేమమే, అభివృద్ధే మొదటి ప్రాధాన్యంగా సీఎం చంద్రబాబు, కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ అన్నారు. మండలంలోని కాట్రావులపల్లి గ్రామంలో టీడీపీ గ్రామ అధ్యక్షుడు మునిరెడ్డి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ విచ్చేసి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ ఏడాది పాలన గురించి వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు కాట్రావులపల్లి గ్రామాన్ని రూ.6కోట్లతో అన్నిరంగాల్లో అభివృద్ధి, సంక్షేమ అందించడానికి ఎమ్మెల్యే అహర్నిశలు పనిచేస్తున్నారని మునిరెడ్డి నాగేశ్వరరావు తెలిపారు. ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, ఆర్యవైశ్య డైరెక్టర్ కొత్త కొండబాబు, సుంకర సీతారామయ్య, కంటే రామారావు, షిషర్మెంట్ సొసైటీ చైర్మన్ కాకరపల్లి కామేష్, వెన్నా వీరబాబు, బిక్కిన బాబి, డమర్ సింగ్ మధు, రాయుడు శివప్రసాద్, పోలినాటి ధర్మానందకుమారి శాస్త్రి, చిన్నాల తాతబ్బాయి, కానేటి ప్రసాద్, లంక సత్తిరాజు, పప్పు గణేష్, సూరిమిల్లి సత్తిబాబు, కాట్రావులపల్లి ఎంఎన్ఆర్ యూత్, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ఏలేశ్వరం, జూలై12(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏడాది సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిర్వహిస్తున్న సుపరిపాలనలో తొలి అడుగుకు విశేష స్పందన లభిస్తోందని ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. శనివారం పట్టణంలో 1వ వార్డులో ఎమ్మెల్యే ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. ఏడాది పాలనలో జరిగిన అభివృద్ధిని వివరించారు. టీడీపీ పట్టణాధ్యక్షుడు మూది నారాయణస్వామి, కౌన్సిలర్లు అలమండ చలమయ్య, బొదిరెడ్డి గోపి, రాయుడు చిన్న, టీడీపీ నాయకులు వాగు రాజేష్, మామిడి లలిత, బుగతా శ్రీనివాస్ పాల్గొన్నారు.

చింతలూరులో సుపరిపాలన

ప్రత్తిపాడు,జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలూరు గ్రామంలో శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో టీడీపీ నాయకులు టీడీపీ కరపత్రాలు పంపిణీ చేశారు. స్థానిక టీడీపీ నాయకులు ఇంటింటికీ తరలివెళ్లి కూటమి ప్రభుత్వంలో జరుగుతున్న అభివృద్ధిని వివరించారు. కార్యక్రమంలో పోలినాటి భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై ప్రచారం

గండేపల్లి,జూలై 12(ఆంధ్రజ్యోతి): గండేపల్లిలో శనివారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని టీడీపీ నాయకుడు బొల్లంరెడ్డి రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీప్రకాష్‌లో వర్క్‌షాప్ ప్రారంభం

గో ఆధారిత ఉత్పత్తులపై అవగాహన



గో ఆధారిత ఉత్పత్తుల గురించి వివరిస్తున్న దృశ్యం

తునిరూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీప్రకాష్ విద్యా సంస్థల అనుబంధ సంస్థ స్పేసెస్ డిగ్రీ కళాశాలలో డిపార్టుమెంట్ ఆఫ్ జువాలజీ ఆధ్వర్యంలో గో ఆధారిత ఉత్పత్తులపై రెండు రోజుల వర్క్‌షాప్ ప్రారంభించారు. గోపూజతో ప్రారంభమైన వర్క్‌షాప్‌లో పంచగవ్య ఉత్పత్తులు, గో ఆధారిత వ్యవసాయ పద్ధతులు, ఉత్పత్తులపై అవగాహన కల్పించారు. మొదటిరోజు ఉత్పత్తుల అవగాహన, తయారీ విధానంలో భాగంగా దంతమంజన్, ధూప బత్తీలు తదితర 20 రకాల ఉత్పత్తులను తయారుచేసే విధానాన్ని వర్క్‌షాప్‌లో శిక్షణ ఇచ్చారు. శిక్షకులు, క్షేత్ర గోసేవ సంయోజక్ ఆకుతోట రామారావు మాట్లాడుతూ గోవు మన సంస్కృతిలో పవిత్రమైనదని, అది మన జీవనశైలికి పునాదిగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో గోసేవ సంయోజక్ రాంజీ, ఓలేటి నారాయణకుమార్, స్పేసెస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.రామకృష్ణారెడ్డి, కళాశాల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్లకు అమర్చిన మోటార్లను తొలగించండి

- దిగువనున్న ప్రజలకు మంచినీరు అందించండి!

జగ్గంపేట, జూలై 12(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట పట్టణంలో 20వేల పైబడి జనాభా ఉంది. 18వార్డుల్లో నిత్యం మూడు పూటలా తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఇటీవల బహుళ అంతస్తులు నిర్మాణాలు చేసి వారికి కావాల్సిన నీటిని వాడుకోవడానికి పంచాయతీ నుంచి కుళాయిలకు డబ్బులు కట్టి తీసుకుంటున్నారు. అనంతరం వారు సంపును ఏర్పాటు చేసుకుని నీటిని నిల్వ చేసుకోవాల్సింది పోయి నేరుగా పంచాయతీ పైపులైన్లకే మోటార్లను బిగించి బహుళ అంతస్థులకు నీటిని తోడుకోవడంతో దిగువన ఉన్న సామాన్యులకు తాగునీరు అందట్లేదని దీంతో చాలీచాలని నీటితో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు పలువురు కుటుంబీకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా ఎవరికి వారు పంచాయతీ కుళాయి పన్నులు కట్టేసి మోటార్లు పైపులు బిగించి వేస్తే భవిష్యత్‌లో దిగువన ఉన్న వారికి సామాన్యులకు తాగునీరు అందే పరిస్థితి కనపడదని, పంచాయతీ అధికారులు అక్రమంగా కుళాయిలకు మోటార్లు బిగించి తమ అవసరాలు నిమిత్తం వాడుకుంటున్న వారిపై కఠినచర్యలు తీసుకోవాలని, మోటార్లు తొలగించి శివారు వరకు మంచినీటి సరఫరా చేసే కార్యక్రమాన్ని చేపట్టాలని జగ్గంపేట ప్రజలు కోరుతున్నారు.

సత్యదేవుడికి వేడుకగా తిరుచ్చిసేవ



అన్నవరం, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుడికి శనివారం ప్రాకారసేవ వేడుకగా జరిగింది. ఉదయం 10గంటలకు స్వామి,అమ్మవార్లను తిరుచ్చివాహనంపై ఆశీనులు గావించి ప్రధానాలయం నుంచి తూర్పురాజగోపురంవద్దకు తోడ్కొనివచ్చారు. పండితుల మంత్రోచ్ఛరణలు, మేళతాళాలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ ముమ్మారు ప్రదక్షిణ గావించారు. అనంతరం హారతులిచ్చి ప్రధానాలయానికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఈవో సుబ్బారావు దంపతులు పాల్గొన్నారు.

మా అతిథిగృహాన్ని సరిచేయరూ..


మూత పడి ఉన్న అతిథిగృహం

జగ్గంపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): మెట్ట ప్రాంతమైన జగ్గంపేట నియోజకవర్గంలో దశాబ్దాల కాలం నుంచి ట్రావెలర్ బంగ్లా ఉంది. ఈ బంగ్లాను అప్పట్లో కాంగ్రెస్ నాయకురాలు ఇందిరాగాంధీ బస చేసేందుకు ఉపయోగించేవారు. గత ప్రభుత్వం ఈ అతిథి గృహానికి తాళాలు వేసి ఎవరూ రాకుండా కట్టడి చేయడంతో పూర్తిగా చెదలుపట్టి లోపల ఉన్న ఏసీలు, ఖరీదైన మంచాలు, సోపాలు, కుర్చీలు పాడైపోయినట్టు సమాచారం. ఈ బంగ్లాలో అనేక మంది రాజకీయ నాయకులు కొంతసేపు సేదతీరి తదుపరి రాజకీయ సమావేశాలకు హాజరయ్యేవారని స్థానికులంటున్నారు. ఎంతో ప్రాముఖ్యత సంతరించుకున్న అతిథిగృహం నేడు పూర్తిగా శిథిలస్థితికి చేరుకోవడంపై పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం స్పందించి దశాబ్దాలు చరిత్ర కలిగిన దీన్ని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సూర్య అప్పారావు, ఎస్ఐ లక్ష్మీకాంతం. హాజరైన ఆటోడ్రైవర్లు

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

ప్రత్తిపాడు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు సర్కిల్ పరిధిలో ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని సీఐ బి.సూర్య అప్పారావు, ఎస్ఐ లక్ష్మీకాంతం కోరారు. స్థానిక లయన్స్ కమ్యూనిటీ హాల్లో శనివారం భద్రతా చర్యల్లో భాగంగా ఆటోడ్రైవర్లకు శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ, ఎస్ఐ మాట్లాడుతూ ఆటో డ్రైవర్లు ప్రమాదాల నివారణకు సహకరించాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ద్విచక్ర వాహనాలపై వెళ్లేటప్పుడు డ్రెస్, చీరకొంగు వంటివి చక్రాల్లో చిక్కుకుని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని మహిళలు అప్రమత్తంగా ఉండాలన్నారు. యువత ఓవర్ స్పీడ్, ర్యాష్, నిర్లక్ష్యంగా డ్రైవ్ చేసి ప్రమాదాల బారిన పడుతున్నారని సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.


తలుపులమ్మ లోవలో ఆదిత్య విద్యా సంస్థల కుటుంబీకులు

తలుపులమ్మను దర్శించుకున్న ఆదిత్య యాజమాన్యం

తునిరూరల్, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఆదిత్య విద్యా సంస్థల యాజమాన్యం నల్లమిల్లి శేషారెడ్డి కుటుంబీకులు శనివారం తలుపులమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆషాడ మాసోత్సవాల సందర్భంగా అమ్మవారికి చీర, సారె సమర్పించారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. అమ్మవారి శేషవస్త్రం వారికి అందజేసి వేదాశీర్వచనం చేశారు.

మల్లేపల్లి సొసైటీ అధ్యక్షుడిగా దిడ్డి శ్రీను ప్రమాణ స్వీకారం

గండేపల్లి, జూలై 12(ఆంధ్రజ్యోతి): మండలంలో ఆరు సొసైటీలకు నూతన అధ్యక్షులను నియమించారు. మల్లేపల్లి సొసైటీ అధ్యక్షుడిగా దిడ్డి చిన్న శ్రీనును ప్రభుత్వం ఎంపిక చేసింది. ఈసందర్భంగా శనివారం చిన్న శ్రీను సొసైటీ అధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు చేపట్టారు. తమపై నమ్మకంతో ప్రభుత్వం, జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు నవీన్ ఈ పదవి కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రమాణ స్వీకారం చేసిన సొసైటీ అధ్యక్షుడు చిన్న శ్రీనుకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీ కొన్న ఆర్టీసీ బస్సు

- ముగ్గురికి తీవ్ర గాయాలు

రాజవొమ్మంగి జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లో వెళితే... దాకరాయికి చెందిన కొర్ర లోవరాజు, మొర్ర అచ్చిబాబు, పాంగి సురేష్ సొంత పని మీద వట్టిగెడ్డ వెళుతుండగా ఎర్రంపాడు జంక్షన్ వద్ద ఎదురుగా వస్తున్న పాడేరు వెళ్లే ఆర్టీసీ బస్సు వీరిని ఢీ కొనడంతో ముగ్గురికి తీవ్ర గాయాలయాయి. క్షతగాత్రులను రాజవొమ్మంగి ప్రభుత్వ ఆసుపత్రికి ఆపై మెరుగైన వైద్యానికి నర్సీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి రిఫర్ చేసారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరసింహమూర్తి తెలిపారు.

అందుబాటులో పీఎం కిసాన్ అర్హత జాబితా

గండేపల్లి, జూలై 12(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకానికి అర్హత ఉన్నత రైతుల జాబితాను రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉంచినట్లు గండేపల్లి ఏవో రెడ్ల శ్రీరామ్ తెలిపారు. అన్నదాత సుఖీభవ పోర్టల్, మనమిత్ర వాట్సాప్‌లో ఆధార్ నంబర్ ద్వారా రైతులు అర్హతను తెలుసుకోవచ్చన్నారు. ఆధార్ నంబర్‌ను మనమిత్ర వాట్సాప్ నంబరు 9552300009కు పంపితే వివరాలు లభ్యమవుతాయన్నారు. రైతు పేరు లేకపోతే అర్హత ఉందని భావిస్తే రైతు సేవా కేంద్రంలో అర్జీతో పాటు పత్రాలు సమర్పించాలన్నారు. ఈనెల13వరకు ఈఅవకాశం ఉంటుందన్నారు.

టీడీపీ నేతల వ్యాఖ్యలు సరికాదు

జగ్గంపేట, జూలై 12(ఆంధ్రజ్యోతి): టీడీపీ నేతల పరిస్థితి గురువింద పూసలను గుర్తుచేస్తుందని వైసీపీ నేతలు రావుల గణేష్‌రాజ కరటూరి వీర్రాజు అన్నారు. వైసీపీ కార్యాలయంలో మీడియాతో శనివారం మాట్లాడారు. తాము పోలీస్‌స్టేషన్, రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాల చుట్టూ తిరిగి రాజకీయాలు చేయడం లేదన్నారు. టీడీపీ నేతల మాటలు దెయ్యాలు వేదాలు వల్లించడమేనన్నారు. నా తాత, తండ్రి, నేను మా శ్రమతోనే అభి వృద్ధిలోకి వచ్చామని మేము ఏరకమైన దందాలు చేయలేదని ఇకనైనా అవాకులు, చవాకులు తగ్గించుకోమని హితవు పలికారు. జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఉపాధ్యక్షుడు రామకుర్తి శ్రీరామ చంద్రమూర్తి, జగ్గంపేట టౌన్ అధ్యక్షుడు కాపవరపు ప్రసాద్, జిల్లా కార్యదర్శి వరుపుల సూరిబాబు, గుర్రం మహాలక్ష్మి, నకిరెడ్డి సుధాకర్, భూమాడ గణపతి, రఘునాథ్, తదితరులు పాల్గొన్నారు

బుజ్జిబాబుకు డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ



గండేపల్లి, జూలై 12(ఆంధ్ర జ్యోతి): సూరంపాలెం ఆదిత్య యూనివర్శిటీ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తోన్న పెనుముచ్చి బుజ్జిబాబు జేఎన్‌టీయూ జీవీ గురజాడ విజయనగరం యూనివర్శిటీ నుంచి డాక్టరేట్ సాధించినట్లు ఆదిత్య యూనివర్శిటీ ప్రోచాన్సలర్ డాక్టర్ నల్లమిల్లి సతీష్‌రెడ్డి తెలిపారు. ఎస్ఆర్‌జీఈసీ గుడ్లవల్లేరు ప్రొఫెసర్ ఎం.కామరాజు, జెన్‌టీయూ జీవీ గురజాడ విజయనగరం యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ కె.బాబులు నేతృత్వంలో బుజ్జిబాబు సమర్పించిన థీసిస్ పెర్ఫార్మన్స్ ఎవాల్యూయేషన్స్ ఆఫ్ డిజిటల్ ఐఐఆర్ ఫిల్టర్ ఆర్కిటెక్చర్స్ ఫర్‌లో పవర్ అప్లికేషన్ అనే అంశంపై డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పొందారని తెలిపారు. ఈసందర్భంగా బుజ్జిబాబును యూనివర్శిటీ చాన్సలర్ డాక్టర్ ఎన్.శేషారెడ్డి, డిప్యూటీ ప్రోచాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, తదితరులు అభినందించారు.



సూరంపాలెంలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ నిర్వహిస్తున్న ఆదిత్య విద్యార్థులు

సూరంపాలెం, యర్రపాలెం గ్రామాల్లో స్వచ్ఛ సర్వేక్షణ్

గండేపల్లి, జూలై 12(ఆంధ్రజ్యోతి): సూరంపాలెం, యర్రంపాలెం గ్రామాల్లో శనివారం సూరంపాలెం ఆదిత్య విశ్వ విద్యాలయం ఎన్ఎస్ఎస్ యూనిట్లు స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్-2025 కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రతను ప్రోత్సహించే జాతీయ మిషన్‌లో భాగంగా ఈ కార్యక్రమం చేశారు. డిప్యూటీ ప్రో ఛాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి, వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎంబీ శ్రీనివాస్ తదితరులు హాజరయ్యారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రత, ప్రవర్తనా మార్పు ప్రాముఖ్యతపై మాట్లాడారు. వలంటీర్లు వంటింటికి తిరిగి ప్రజలకు కార్యక్రమ లక్ష్యాలు వివరించి క్యూఆర్ కోడ్ ద్వారా గృహ వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌డేట్ చేసుకునే విధానాన్ని వారు తెలిపారు.


రాజా చిత్రపటం వద్ద ఎమ్మెల్యే సత్యప్రభ, తనయుడు సాయితర్షిత్ తదితరుల నివాళి

వరుపుల రాజాకు నివాళులు

ప్రత్తిపాడు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో విద్యాభ్యాసం ముగించుకుని శనివారం ప్రత్తిపాడు నియోజకవర్గంలోని పెదశంకర్లపూడి చేరుకున్న ఎమ్మెల్యే సత్యప్రభ తనయుడు సాయితర్షిత్ టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి తండ్రి రాజాకు నివాళులర్పించారు. తొలుత అమెరికా నుంచి మధురపూడి విమానాశ్రయానికి చేరుకున్న సాయితర్షిత్‌కు సీబీఎన్ ఆర్మీ కోఆర్డినేటర్ యాళ్ళ జగదీష్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం నివాసంలో తల్లితో కలిసి తండ్రి చిత్రపటానికి పూలమాలలు వేశారు.